

చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





ప్రపంచంలోనే
టాప్ 5 నగరాల్లో అమరావతి
- జనవరి నుంచి
29 గ్రామాల్లో మౌలిక వసతులు
- పురపాలక శాఖ మంత్రి
నారాయణ

7





# నవశకానికి నాంది!

*నేడు సీఎం చంద్రబాబు క్వాంటం టాక్*

- వేలమంది టెక్ విద్యార్థులతో సీఎం చారిత్రాత్మక ప్రసంగం
- క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి క్వాంటం ప్రోగ్రామ్ నిర్వహణ
- క్వాంటం నైపుణ్యాలు పెంచటమే ఏపీ ప్రభుత్వ లక్ష్యం
- భవిష్యత్ అవసరాలుగా తగ్గట్లుగా మానవ వనరుల అభివృద్ధి
- 10 రోజుల్లోనే 50 వేలకు పైగా టెక్ విద్యార్థుల రిజిస్ట్రేషన్
- వీరిలో 51 శాతం మహిళలే

2

# 'బెల్టు' తీయాల్సిందే



- హర్యానా మోడల్‌పై అధ్యయనం
- ఆదాయమే లక్ష్యం కారాదు
- మద్యం వ్యాపారంలో ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలి
- లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పునఃపరిశీలన
- ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్
- ఎక్సైజ్ శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం

3

పాస్టర్లకు రూ.51 కోట్ల గౌరవ వేతనం..

## రేపు సాయంత్రం లోగా జమ

- ఏసు సందేశమే ప్రపంచానికి స్ఫూర్తి
- ప్రేమ, శాంతి, సేవా బోధనలు సదా ఆచరణీయం
- క్రైస్తవుల భద్రతకు, గౌరవానికి భంగం కలుగనివ్వం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం
- ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్ర పునర్నిర్మాణం
- విజయవాడలో ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబు

4





అమరావతిలో..

## అత్యాధునిక కల్చరల్ సెంటర్

- నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం
- జోన్ 8 ఎల్పీఎస్ లే అవుట్‌లో రూ.1358 కోట్లతో మౌలిక సదుపాయాలు
- 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2



## తరచూ తాగునీటి పరీక్షలు

- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- మూడు రీజియన్లల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లు
- ప్రజల కోణంలో ఆలోచించి ప్రభుత్వ సేవలు
- ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు

3

వైకుంఠ ద్వార దర్శనాల్లో

## సామాన్యులకే పెద్దపీట

- ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి
- వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై సమీక్ష
- పాల్గొన్న హోంమంత్రి అనిత, అనగాని

8

## కరెంటోళ్ల జనబాటకు శ్రీకారం

- విద్యుత్ సమస్యల పరిష్కారానికే కార్యక్రమం
- రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌కు ప్రోత్సాహం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

9

రాష్ట్రంలో పర్యాటకుల భద్రతకు..

## టూరిజం సేఫ్టీ, ప్రొటెక్షన్ పాలసీ



- ఏపీ పర్యాటకం సురక్షితం అనే నమ్మకం కలిగించాలి
- పర్యాటక ప్రదేశాల్లో ప్రత్యేక ప్రవర్తనా నియమావళి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

6

## ఏసు సందేశం అందరికీ ఆదర్శం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్
- దుబాయ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు
- మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి పాల్గొన్న టీడీ జనార్దన్

6





ఉపాధి కల్పనలో

## ఏపీకేవీఐబీ సేవలు భేష్

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అభినందనలు
- లక్ష్యానికి మించి పీఎంఈజీపీ యూనిట్ల ఏర్పాటుపై హర్షం

6

భక్తులకు జగన్‌రెడ్డి

## క్షమాపణ చెప్పాలి

- అవినీతికి ఆది పురుషుడు ఆయన
- పరకామణి దొంగతనాన్ని సమర్థిస్తారా?
- హిందూ మతంపై దాడి చేయడమే వారి ఎజెండా
- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

8

- నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం
- జోన్ 8 ఎల్పీఎస్ లే అవుట్‌లో రూ.1358 కోట్లతో మౌలిక సదుపాయాలు
- 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# అమరావతిలో.. అత్యాధునిక కల్చరల్ సెంటర్



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి ప్రాంతంలో ఆధునిక కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు త్వరితగతిన భూమిని గుర్తించాలని సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ అంశాలను అథారిటీ ఆమోదించింది. అలాగే రాజధాని నిర్మాణానికి సంబంధించిన విషయాలపై సీఆర్డీఏ, ఏడీసీ అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...రాజధాని ప్రాంతంలో కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం అమరావతిలో ఇప్పటికే ఓ వేదికను నిర్మించి ఉంటే బాగుండేది. దీని కోసం అనువైన ప్రాంతాన్ని గుర్తించండి. ఏర్పాటు చేయబోయే కల్చరల్ సెంటర్‌కు ఏ పేరు పెడితే బాగుంటుందో ఆలోచించండి. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలి.

భూములిచ్చిన రైతులకు కేటాయించే ప్లాట్లకు లే అవుట్ల వద్ద పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి. రాజధాని రైతుల సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలి. రాజధాని పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. అటవీ సంపద, నదీ పరివాహకం, కొండలు వంటివి అమరావతికి ప్రకృతి శోభను తీసుకొస్తాయి. వివిధ రకాల పూల మొక్కలను రాజధాని ప్రాంతంలో నాటి పర్యాటకులను... ప్రకృతి ప్రేమికులను ఆకర్షించాలి. అదే విధంగా పార్కులను ఏర్పాటు చేయాలి. అమరావతికి వచ్చే వారికి అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో హొటళ్లు ఉండేలా చూడాలి. ఈ మేరకు వాటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్ సహా సీఆర్డీఏ, ఏడీసీ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


### 56వ సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన అంశాలు:

- అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రాంగణంలో 2 ఎకరాల్లో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్.
- అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపు.
- శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం.
- హొటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో 6 ఎకరాలు కేటాయింపు.
- 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు.
- ఎల్పీఎస్ జోన్-8లో లే-అవుట్ల అభివృద్ధికి రూ.1358 కోట్లు కేటాయింపు.
- 202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు. వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు.

# నవశకానికి నాంది!

## నేడు సీఎం చంద్రబాబు క్వాంటం టాక్

- వేలమంది టెక్ విద్యార్థులతో సీఎం చారిత్రాత్మక ప్రసంగం
- క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి క్వాంటం ప్రోగ్రామ్ నిర్వహణ
- క్వాంటం నైపుణ్యాలు పెంచటమే ఏపీ ప్రభుత్వ లక్ష్యం
- భవిష్యత్ అవసరాలుగా తగ్గట్లుగా మానవ వనరుల అభివృద్ధి
- 10 రోజుల్లోనే 50 వేలకు పైగా టెక్ విద్యార్థుల రిజిస్ట్రేషన్
- వీరిలో 51 శాతం మహిళలే




అమరావతి (చైతన్యరథం): అమరావతి నుండి సీఎం చంద్రబాబు నవశకానికి నాంది పలకనున్నారు. అమరావతి క్వాంటం కంప్యూటర్ కేంద్రం ఏర్పాటుతో సాంకేతికంగా భారీ ముందడుగు వేస్తున్న ఏపీ ప్రభుత్వం ఆ రంగంలో నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది.క్వాంటంటాక్ పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం టెక్ విద్యార్థులను ఉద్దేశించి చారిత్రాత్మక ప్రసంగం చేయనున్నారు. క్వాంటం ఐటీ కంపెనీలు క్యూబిట్, వైసర్ సంస్థలతో సంయుక్తంగా ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తు న్న క్వాంటం ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులతో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఈ క్వాంటం ప్రోగ్రామ్‌కోసం 50వేల మందికి పైగా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..

దేశంలోనే అతిపెద్ద క్వాంటం విద్యా సదస్సులో డిజిటల్ మాధ్యమం ద్వారా మంగళవారం ఉదయం 9.30 గంటలకు విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్ మ్యాప్‌ను సీఎం వివరించనున్నారు. భవిష్యత్తులో క్వాంటం టెక్నాలజీ ద్వారా సాధించనున్న లక్ష్యాల గురించి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. క్వాంటం ప్రోగ్రామ్ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం - క్యూబిట్- వైసర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి కేవలం 10 రోజుల వ్యవధిలోనే 50 వేలకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ప్రత్యేకించి ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిలో 51 శాతం మంది మహిళలే ఉండటం విశేషం.

అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దటంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం ఉన్న మానవ వనరుల్ని తీర్చిదిద్దేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ క్వాంటం ప్రోగ్రామ్‌ను చేపట్టింది.ఈ కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న వారిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 3 వేల మందికి తదుపరి స్థాయి శిక్షణ కూడా ఇవ్వనున్నారు. అలాగే ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్, సహా కేంద్ర ప్రభుత్వ సంస్థలు సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటం మిషన్లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కూడా కల్పించనున్నారు. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా వచ్చే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారు చేయటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసా డైరెక్టర్ ప్రాచీ వఖారియా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

### ఉపాధిహామీ పథకంలో..

# కేంద్రం వాటా తగ్గింపు సరికాదు

- సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వినతిపత్రం



అమరావతి (చైతన్యరథం): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సమంజసం కాదని, దీనిపై కేంద్రంతో మాట్లాడి మహాత్మాగాంధీ పేరును కొనసాగించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

ఇప్పటి వరకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకానికి ఇచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి కేంద్రం కుదించిందని, 40 శాతం నిధులను రాష్ట్రం భరించాలంటే ఏపీ సహా పలు రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. అదే విధంగా 100 నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతామని కేంద్రం చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకు కుటుంబానికి సగటున 50 పని దినాలు కూడా కల్పించలేదని తెలిపారు. ఇప్పటి వరకూ హక్కుగా ఉన్న ఈ చట్టంలో సవరణల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కష్టంగా మారుతుందని, వెంటనే సవరణలను వెనక్కి తీసుకునేలా కేంద్రంతో మాట్లాడాలని కోరారు.

# బెల్టుషాపులపై ఉక్కుపాదం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, ఇంకా... లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు... తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలని సూచించారు. బార్ ఏఆర్ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని సీఎం నిర్దేశించారు. అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ ఈడీ రాహుల్ దేవ్ శర్మ హాజరయ్యారు. కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావంపై సమీక్షలో సమగ్రంగా చర్చించారు.



- హర్యానా మోడల్‌పై అధ్యయనం
- ఆదాయమే లక్ష్యం కారాదు
- మద్యం వ్యాపారంలో ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలి
- లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పున:పరిశీలన
- ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్
- ఎక్సైజ్ శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం

### పెరిగిన మద్యం విక్రయాలు

అక్టోబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు...రూ.8,000 కోట్ల మేర ఎక్సైజ్ ఆదాయం లక్ష్యం పెట్టుకోగా, రూ.7,041 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 17 వరకు మద్యం విక్రయాల్లో 4.52 శాతం పెరుగుదల కనిపించిందని... ఐఎంఎఫ్ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) విక్రయాలు 19.08 శాతం, బీర్ విక్రయాలు 94.93 శాతం పెరిగాయని అధికారులు వెల్లడించారు. ఈ డిసెంబర్ 18 నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.8,422 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 3 శాతం పెరుగుదల చూపిస్తామని అధికారులు చెప్పారు. అంతర్జాతీయ బ్రాండ్‌లు తీసుకురావడం, నాణ్యమైన మద్యం అందుబాటు ధరకు అందివ్వడంతో ఐఎంఎఫ్ఎల్, బీర్ విక్రయాల్లో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారతదేశంలోనే అత్యధిక వృద్ధి కనబరిచిందని అధికారులు వెల్లడించారు. అయితే తెలంగాణ కన్నా ఆంధ్రప్రదేశ్‌లో తలసరి మద్యం వినియోగం తక్కువ ఉందని... తెలంగాణలో తలసరి 4.74 లీటర్లు మద్యం వినియోగిస్తుంటే, ఏపీలో తలసరి వినియోగం 2.77 లీటర్లుగా ఉందన్నారు.

### 35 శాతం డిజిటల్ చెల్లింపులు

మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతానికి పెరిగాయని, కొన్ని జిల్లాల్లో 40-47 శాతం వరకు డిజిటల్ లావాదేవీలు నమోదైనట్టు వివరించారు. అయితే నగదు వినియోగాన్ని తగ్గించి... డిజిటల్ చెల్లింపులు జరిగేలా అందరిలో అవగాహన పెంచాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి మద్యం బాటిల్‌కు ప్రత్యేక లిన్ (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్) త్వరితగతిన తీసుకురావాలని, సాధారణ ప్రజలు కూడా సులభంగా గుర్తించేలా ఉండాలన్నారు. లిన్‌లో... బ్రాండ్, బ్యాచ్, లైన్‌తో పాటు తయారైన తేదీ, గంటలు, నిమిషాలు, సెకన్లు సహా వివరాలు ఉండాలన్నారు. లిన్‌తో ప్రస్తుతం అనుసరిస్తున్న హీల్ (Hologram Excise Adhesive Labels) లోపాలను సరిచేయొచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే, జియో-ట్యాగింగ్ ద్వారా మద్యం సరఫరాలో పూర్తి పారదర్శకత వస్తుందని... ట్రాకింగ్, షాపుల రేషనలైజేషన్‌పైనా దృష్టి పెట్టాలని సీఎం అన్నారు.

### బెల్టుషాపులపై కఠిన చర్యలు

అనధికార విక్రయ కేంద్రాలుగా తయారైన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపులు పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి హర్యానాలో అనుసరించిన సబ్ లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం గ్రామీణ, దూర ప్రాంతాల్లో షాపులు లేకపోవడం వల్ల బెల్ట్ షాపుల సమస్య నెలకొందని అధికారులు చెప్పారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా... మద్యం వినియోగం అనంతరం బాటిల్ తిరిగి ఇస్తే డీఆర్ఎస్ (డిపాజిట్ రిటర్న్ స్కీమ్) కింద నగదు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

# తరచూ తాగునీటి పరీక్షలు




- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం
- మూడు రీజియన్లల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లు
- ప్రజల కోణంలో ఆలోచించి ప్రభుత్వ సేవలు
- ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం):ప్రజలకోణంలో ఆలోచించేలా అధికారులు వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. క్షేత్రస్థాయిలో వివిధసేవలు ఏ విధంగా అందుతున్నాయనే అంశంపై ఆరాతీశారు. ఈ మేరకు అధికారులకు సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రజలకు సంతృప్తికరంగా సేవలందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. ఈపథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఎలా చూస్తున్నారనే కోణంలో విశ్లేషించాలి... దానికి అనుగుణంగా సేవలందించడంలో మార్పులు చేర్పులుచేసుకోవాలని సీఎంచంద్రబాబు సూచించారు.

### గంజాయిపై ఉక్కుపాదం

గంజాయి కట్టడిపై పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు మరింతగా అమలు చేయాలి. గంజాయి కట్టడిపై మూడు రీజియన్లల్లో చేపట్టే అవగాహన కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటాను. గంజాయి నివారణకు, డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు చాలా వరకు మంచి ఫలితాలు వస్తున్నాయి.అయినా అందర్నీ భాగస్వాములను చేసేలా పెద్దఎత్తున అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించాలి. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి మూడు ప్రాంతాల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేద్దాం. అమరావతి, తిరుపతి, విశాఖల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు.

### ప్రజా భాగస్వామ్యం అవసరం

ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాల్లో ప్రజా భాగస్వామ్యం ఉండేట్టుగా చూడాలి. వీధిదీపాలు, తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకూడదు. సరఫరా చేసే తాగునీటికి సంబంధించిన పరీక్షలు చేపట్టాలి... వాటిని ప్రజలకూ వివరించాలి. ఎక్కడైనా తాగునీరు కలుషితమయిందని వెల్లడైతే... వెంటనే అలెర్ట్ కావాలి. హాస్టళ్లల్లో తాగునీటి, పారిశుద్ధం వంటి విషయాల్లో ఏ మాత్రం అలక్ష్యం చేయొద్దు. ఆర్వో ప్లాంట్లు లేని హాస్టళ్లల్లో త్వరితగతిన ప్లాంట్లను ఏర్పాటు చేయండి. క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయాలకు రావాల్సిందే. ఫైళ్ల మానిటరింగ్, అటెండెన్స్ వంటి అంశాలను ఆర్టీజీ సెంటర్ ఎప్పటి కప్పుడు నివేదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### సీఎం చంద్రబాబుతో ఒడిశా గవర్నర్ హరిబాబు భేటీ

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో గవర్నర్ హరిబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.



చైతన్యరథం

# పాస్టర్లకు రూ.51 కోట్ల గౌరవ వేతనం.. రేపు సాయంత్రం లోగా జమ





విజయవాడ (చైతన్యరథం): క్రీస్తు త్యాగాలను స్మరిస్తూ ఆయన చూపిన బాటను అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్బోధించారు. క్రైస్తవులకు సంక్షేమం, ఆర్థిక చేయూత అందించింది తమ ప్రభుత్వమేనన్నారు. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. క్రిస్మస్ కేట్ కట్ చేసి మత పెద్దలకు తినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఏసు ప్రభువు ఈ లోకంలో జన్మించిన రోజును మనం క్రిస్మస్‌గా జరుపుకుంటాం. ప్రపంచంలో జరిగే అతిపెద్ద పండుగ క్రిస్మస్. మేరీ మాత కడుపున ఏసు ప్రభువు జన్మించిన పవిత్రమైన రోజు మన అందరికీ పండుగైంది. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే శాశ్వత విలువలను అందించిన ఏసు సందేశం ఎప్పటికీ మార్గదర్శకం. క్రీస్తు బోధనల్ని, ఆయన చూపిన బాటను అంతా అనుసరించాలి. పశువుల పాకలో పుట్టి...గొర్రెల కాపరిగా పెరిగిన ప్రజా రక్షకుడు ఏసు. నమ్మిన సిద్ధాంతం కోసం బలి దానానికి సైతం వెనుకాడని క్రీస్తు గొప్పదనం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ప్రభువు తాగ్యాన్ని స్మరించుకోవాలి. శాంతి మార్గాన్ని అనుసరించాలి. ప్రేమ తత్వాన్ని పెంచాలి. ఈర్ష్య, ద్వేషాలకు దూరంగా ఉండి పాపులను సైతం క్షమించాలని బైబిల్ చెబుతోందని ముఖ్యమంత్రి అన్నారు.

- ఏసు సందేశమే ప్రపంచానికి స్ఫూర్తి
- ప్రేమ, శాంతి, సేవా బోధనలు సదా ఆచరణీయం
- క్రైస్తవుల భద్రతకు, గౌరవానికి భంగం కలుగనివ్వం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం
- ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్ర పునర్నిర్మాణం
- విజయవాడలో ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబు

## ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం

ఐదేళ్ల వైసీపీ అసమర్ధ పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. నేను ఎంత లోతుకు పోతే అన్ని ఎక్కువ సమస్యలు కనపడుతున్నాయి. ఇలాంటి విధ్వంసం నా జీవితంలో చూడలేదు. అన్నింటినీ అధిగమిస్తూ ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. మనో సంకల్పంతో లక్ష్యాన్ని సాధిస్తున్నాం. 18 నెలల్లో రాష్ట్రం తిరిగి నిలదొక్కుకునే పరిస్థితికి తీసుకొచ్చాం. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశాం. క్రైస్తవుల్లో పేద కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ ఆర్థిక భరోసా కల్పించాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం, ఉచిత బస్సు పథకం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం, పాస్టర్లకు గౌరవ వేతనాలు .. ఇలా అన్ని విధాలా క్రిస్టియన్ మైనారిటీలను ఆదుకుంటున్నాం. ప్రత్యేకంగా క్రైస్తవ సమాజం కోసం రూ.22 కోట్లు ఖర్చు చేసి, 44,812 మంది క్రైస్తవ సోదర సోదరీమణులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాం. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నాం. ఇందు కోసం మే 2024 నుంచి నవంబర్ 2024 వరకు...మొత్తం రూ.30 కోట్లు విడుదల చేశాం. డిసెంబర్ 2024 నుంచి నవంబర్ 2025 వరకు రూ.51 కోట్ల మొత్తాన్ని ఈ నెల 24వ తేదీ లోగా వారి ఖాతాల్లో వేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

## క్రైస్తవులకు ఆర్థిక చేయూత

క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉపాధి, ఆర్థిక సాధికారత విషయంలో అండగా ఉంటాం. భద్రతకు, గౌరవానికి భంగం కలగనివ్వం. వారి కోసం ఉపాధి పథకాలను పునః ప్రారంభించాం. 2025-26లో రూ.20 కోట్లు కేటాయించి, 2,000 మంది లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. సీఈడీఎం ఆధునీకరణకు రూ.5 కోట్లు కేటాయించాం, రూ.6 కోట్ల పెండింగ్ బకాయిలను కూడా క్లియర్ చేస్తున్నాం. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ, టెట్, నీట్, యూపీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నాం. మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేశాం. డీఎస్సీలో 26 కేంద్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6,000 మందికి శిక్షణ ఇస్తే 500 మందికి పైగా ఎంపికయ్యారు. భవిష్యత్‌లో మరింత మంది శిక్షణ అందిస్తాం. అలాగే 2014 నుంచి 2018 మధ్య 977 చర్చిలకు రూ.70 కోట్లు మంజూరు చేశాం. వీటిలో 377 చర్చ్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మన హయాంలో గుంటూరులో క్రిస్టియన్ భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశాం. మరిన్ని నిధులు విడుదల చేసి ఈ ఏడాది క్రిస్టియన్ భవనాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవ సోదర, సోదరీమణులకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న వారికి రూ.60,000, రూ.3 లక్షలకు పైగా ఉన్న వారికి రూ.30,000 ఇస్తున్నాం. దీని కోసం ఈ ఏడాది రూ.1.50 కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు.

## సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి క్రైస్తవ మిషనరీలు

సమాజ సేవలో క్రైస్తవ సంస్థలు ముందున్నాయి. క్రిస్టియన్ పాఠశాలలు, కాలేజ్‌లు, ఆసుపత్రులు దశాబ్దాలుగా చేస్తున్న సేవలు వెలకట్ట లేనివి. లక్షల మంది జీవితాల్లో మార్పు తెస్తున్నాయి. మిషనరీ పాఠశాలల్లో చదివి ఎంతోమంది ఎంతో ఉన్నత స్థానాలకు వెళ్లారు. క్రమశిక్షణ, సేవ, విజ్ఞానానికి మిషనరీ విద్యా సంస్థలు కేంద్రంగా ఉన్నాయి. గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ, విజయవాడ ఆంధ్ర లయోలా కాలేజీ వంటి క్రిస్టియన్ విద్యా సంస్థలు రాష్ట్రంలో ఎంతోమంది ఉన్నతికి సేవ చేశాయి. ఎన్టీఆర్ కూడా మిషనరీ కాలేజ్ లోనే చదువుకున్నారు. పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.









# సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబు

విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ వేడుకకు పెద్దసంఖ్యలో క్రైస్తవ సోదరులు తరలి వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత కేక్ కట్ చేసి పాస్టర్లకు తినిపించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు.











# రాష్ట్రంలో పర్యాటకుల భద్రతకు..

# టూరిజం సేఫ్టీ, ప్రొటెక్షన్ పాలసీ

- ఏపీ పర్యాటకం సురక్షితం అనే నమ్మకం కలిగించాలి
- పర్యాటక ప్రదేశాల్లో ప్రత్యేక ప్రవర్తనా నియమావళి
- టూరిజం హాట్ స్పాట్లలో హెలీపోర్టుల అభివృద్ధి
- నిర్ణీత కాలవ్యవధిలో ప్రణాళికల అమలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం
- అటవీ, పర్యాటక, దేవాదాయ, రోడ్లు భవనాల శాఖల మంత్రులతో సమన్వయ సమావేశం



అమరావతి (చైతన్యరథం): మన రాష్ట్రంలో పర్యటక రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి.. వాటిని అందిపుచ్చుకునే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలి.. రాష్ట్రానికి వచ్చే పర్యటకుల భద్రతకు 100 శాతం భరోసా ఇవ్వాలి.. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా సురక్షితం అన్న భావన పర్యాటకుల్లో కలగాలి.. అందుకోసం టూరిజం సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే పర్యటకులు సంతోషంగా తిరిగి వెళ్లాలన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులందరూ తరలి వచ్చినప్పుడు వారికి భద్రమైన పరిస్థితులు కల్పించాలని, మహిళా పర్యాటకుల భద్రతకు ప్రత్యేక విధానం తీసుకురావాలని సూచించారు. సోమవారం రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి, ఉపాధి కల్పనపై పర్యాటక, దేవాదాయ, రోడ్లు, భవనాల శాఖల మంత్రులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భం గా రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పర్యాటక శాఖలో అద్భుత అవకాశాలు ఉన్నాయన్నారు. టూరిజం హాట్ స్పాట్లను గుర్తించడం, అక్కడ సౌకర్యాలు మెరుగుపర్చడం ద్వారా దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించవచ్చు. ఆయా ప్రాంతాల్లో హెలీపోర్టులు ఏర్పాటు చేయవచ్చు. అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. నిర్ణీత సమయంలో వాటిని అమలు చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేను చాలా సందర్భాల్లో టూరిజం పాలసీపై చర్చించాం. పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల్లో అత్యంత ప్రాధాన్యతాంశం భద్రత. రాష్ట్రంలో ఏ మూలకి వెళ్లినా భద్రతకు ఇబ్బంది ఉండదు అన్న భావన టూరిస్టుల్లో కల్పించాలి. ప్రకృతిని ఇష్టపడుతూ అటవీ ప్రాంతాల్లో పర్యటించేవారికి తగిన భద్రత అందించాలి. పర్యాటక ప్రదేశాల్లో శాంతి,భద్రతలు పూర్తిగా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎకో టూరిజం అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల్లో మన సంస్కృతి, సామాజిక పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. పర్యటకులతో ఎలా మసలుకోవాలి అనే అంశంపై ఒక ప్రవర్తనా నియమావళి తీసుకువచ్చి, దాన్ని కచ్చితంగా అమలు చేయాలి. ఉల్లంఘనలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి. ముఖ్యంగా హెూటల్స్, ట్రావెల్స్ నిర్వాహకులు ఈ నియమావళి కచ్చితంగా పాటించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ మార్గ నిర్దేశం చేశారు.

### ప్రకృతిని వారసత్వ సంపదగా గుర్తించాలి

టూరిజం హాట్ స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో హెలీ టూరిజం అభివృద్ధి చేయాలి. అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఒకే తరహా ఆర్కిటెక్చర్ ఏర్పాటు చేయాలి. మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆర్కిటెక్చర్‌ని అభివృద్ధి చేయాలి. అది అంతరించిపోయిన కళలకు పునరుజ్జీవం పోసేదిగా ఉండాలి. రాష్ట్రంలో ఏ మూలకి వెళ్లినా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామన్న భావన పర్యాటకులకు కలగాలి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం వెంబడి అడ్వెంచర్ టూరిజం, కృష్ణా, గోదావరి జలాల్లో బోట్ రేసులు వంటి వాటిని నిర్వహించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించాలి. మంగళగిరి, కొండపల్లి, సిద్ధవటం, తదితర కొండ ప్రాంతాల్లో పర్వతారోహణకు అనువైన పరిస్థితులు కల్పించాలి. నేను గతంలో పార్వతీపురం మన్యం ప్రాంతానికి వెళ్లిన సమయంలో అద్భుతమైన ప్రకృతి ప్రసాదిత దృశ్యాలు వీక్షించే అవకాశం దక్కింది. అలాంటి ప్రాంతాలను వారసత్వ సంపదగా గుర్తించి పరిరక్షణకు ఏర్పాట్లు చేయాలని పవన్ సూచించారు.

### మరిన్ని శాఖలను భాగస్వాముల్ని చేయాలి

మన కవుల గొప్పదనాన్ని భావితరాలకు అందించేలా గుర్రం జాషువా, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ అప్పారావు, మొల్లమాంబ, తదితరుల ఇళ్లను పరిరక్షించి, వాటిని సాహితీ సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలి. సమాజాన్ని ఆధ్యాత్మిక, సేవా మార్గం వైపు నడిపిన మన అవధూతలు గొలగమూడి వెంకయ్యస్వామి, కాశీ నాయన, తదితరుల ఆశ్రమాలను స్పిరిచ్యువల్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి. అల్లూరి జిల్లా, చింతపల్లి ప్రాంతంలో ఉన్న జంగిల్ బెల్స్ సమస్యను పరిష్క రించాం. పర్యాటక అభివృద్ధిలో టూరిజం, అటవీశాఖలతో పాటు గిరిజన సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖలను కూడా భాగస్వామ్యం చేయాలి. ఎలాంటి ప్రణాళిక రూపొందించినా నిర్ణీత కాల వ్యవధిలో వాటిని పూర్తి చేయాలని పవన్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి తదుపరి సమావేశం జనవరి 6వ తేదీ నిర్వహించాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి, శాంతిప్రియ పాండే, రాహుల్ పాండే, శరవణన్, రామచంద్ర మోహన్, శ్రీనివాస్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కృష్ణబాబు, కాంతిలాల్ దండే, హరి జవహర్‌లాల్ పాల్గొన్నారు.

# ఏసు సందేశం అందరికీ ఆదర్శం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్
- దుబాయ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు
- మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి పాల్గొన్న టీడీ జనార్దన్




దుబాయ్ (చైతన్యరథం): ప్రేమ, కరుణ, శాంతిని బోధించిన ఏసు క్రీస్తు సందేశం అందరికీ ఆదర్శమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ అన్నారు. దుబాయ్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదలశాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి టీడీ జనార్దన్ హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాల వారు పాల్గొన్న ఈ వేడుకలో ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఆ తర్వాత వక్తలు మాట్లాడారు.

అనంతరం టీడీ జనార్దన్ మాట్లాడుతూ కిందటేడాది దుబాయ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు తాను హాజరయ్యానని ఈసారి కూడా ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. నిరంతరం ప్రజల మధ్య తీరిక లేకుండా గడిపే మంత్రి నిమ్మల రామానాయుడు.. ఇక్కడ స్థిరపడిన తన పాలకొల్లు నియోజకవర్గ ప్రజలను కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజెప్పడానికి ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా వచ్చారని తెలిపారు. ప్రపంచంలో జరుపుకునే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని, క్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్ పండుగగా ప్రపంచవ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపుకుంటారని పేర్కొంటూ.. ప్రపంచ మానవాళికి క్రీస్తు అందించిన గొప్ప వరాలు – ప్రేమ, కరుణ, క్షమ, శాంతి, సామరస్యం వంటి మహెూన్నతమైన మానవీయ గుణాలని పేర్కొన్నారు. ప్రేమతో ఎవరినైనా జయించవచ్చని ఏసు క్రీస్తు రుజువు చేశారని, శాంతితోనే అభివృద్ధి సాధ్యమని తెలియజెప్పారన్నారు. వాటిని అనుసరిస్తున్న ప్రపంచ దేశాలు అభివృద్ధిలో వడివడిగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తే నిత్యజీవితంలో సమస్యలు లేకుండా జీవించడం సాధ్యపడుతుందన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించిన శ్యామ్, తదితరులను టీడీ జనార్దన్, నిమ్మల రామానాయుడు అభినందించారు.

### అమరావతి క్వాంటం వ్యాలీలో..

# యుద్ధప్రాతిపదికన భవనాల నిర్మాణం

- 2 భవనాల నిర్మాణానికి రూ.103.96 కోట్లు
- ఐఏఎస్‌ల భవనాల ఇంటీరియర్ పనులకు రూ.109కోట్లు
- సీఆర్డీఏ పాలనా వ్యయానికి రూ.100 కోట్లు
- రాజధానిలు వరద ముంపు నివారణకు చర్యలు
- జోన్ 8లోని ఎల్పీఎస్ పనులకు రూ.1,358 కోట్లు
- సీఆర్డీఏ అథారిటీ సమావేశం నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ




అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 103.96 కోట్ల కేటాయింపునకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియా సమావేశంలో మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ ఎక్విప్‌మెంట్ అమరావతికి చేరుకోనున్న దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన రెండు భవనాలను 43వేల చదరపు అడుగుల్లో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. భవనాల నిర్మాణానికి టెండర్ పిలిచి ఎల్1ను ఎంపిక కూడా చేశామన్నారు. భవనాల నిర్మాణాలను సీఆర్డీఏ అథారిటీ వెంటనే ప్రారంభిస్తుందని మంత్రి వివరించారు. అలాగే అఖిలభారత సర్వీసు అధికారుల నివాసాల ఇంటీరియర్ పనుల కోసం రూ.109 కోట్లు విడుదల చేశామన్నారు. నాబార్డ్ మంజూరు చేసిన రూ. 7500 కోట్లలో రూ. 1502 కోట్లు విడుదల చేశామన్నారు. వాటిలో రూ.100 కోట్లు ఏపీసీఆర్డీఏ, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ పాలనా వ్యయం మంజూరుకు అనుమతించామన్నారు. మంత్రుల బృందం నిర్ణయం మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ యూనివర్సిటీ ఏర్పాటుకు శాఖమూరు గ్రామ పరిధిలో 23.127 ఎకరాలు కేటాయించామన్నారు. యూనివర్సిటీకి 60 సంవత్సరాల పాటు ఒక రూపాయి లీజు తో భూమి ఇచ్చామన్నారు. యూనివర్సిటీ నిర్మాణానికి ఆయుష్ సంస్థ రూ. 750 కోట్లకు పైగా వ్యయం చేయనుందన్నారు.

**వరద ముంపు నివారణకు..**

సదరన్ గ్లోబల్ హోటళ్ల వారికి గతంలో కేటాయించిన 2 ఎకరాలు, ఓం సాయి అసోసియేషన్‌కు కూడా 4 ఎకరాలు కేటాయింపులు జరిగినా అక్కడ భూ సమస్యలు తలెత్తడంతో వారికి ఇతర ప్రాంతంలో భూమి కేటాయించాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. అమరావతిని వరద ముంపు నుండి కాపాడటానికి నెదర్లాండ్స్ సంస్థతో డిజైన్లు రూపొందించామన్నారు. కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ లతో పాటు 6 రిజర్వాయర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇవి కాకుండా అధికంగా వచ్చే వరద ముప్పు నుండి రక్షణగా మరో 22,500 క్యూసెక్కల నీటిని బటయకు తరలించడానికి కూడా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గుంటూరు ఛానల్ ద్వారా 4వేల క్యూసెక్కులు, ఉండవల్లిలో మరో 8,400 క్యూసెక్కులు పంపింగ్ చేసే విధంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. అదనపు వరద నీరు తరలించడానికి రూ. 443.76 కోట్లు అవుతుందని తెలిపారు. దీంతో క్లౌడ్ బరస్ట్ లాంటి విపత్తులు వచ్చినా నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**జరీబు భూములపై రాష్ట్రస్థాయి కమిటీ**

జోన్ 8లోని ఎల్పీఎస్ పనులకు రూ.1,358 కోట్లు కేటాయించామని మంత్రి నారాయణ తెలిపారు. ఇక జరీబు, నాన్ జరీబు భూముల పై రైతుల్లో నెలకొన్న అపోహలను తొలగించడానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. జరీబు భూముల భూములపై గతంలో ఏర్పాటు చేసిన మండల, కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీలు 18 ఎకరాలు తప్ప మిగిలిన భూములు నాన్ జరీబు అని తేల్చాయని వివరించారు. అయితే రైతు సోదరుల విజ్ఞప్తి మేరకు వివిధ డిపార్ట్‌మెంట్ ల అధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని వేస్తున్నామన్నారు. 2014 డిసెంబర్ 8న తీసిన శాటిలైట్ చిత్రాలను ఆధారంగా జరీబు భూములపై నిర్ణయం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

# రాష్ట్రానికి మణిహారంగా అమరావతి స్పోర్ట్స్ యూనివర్శిటీ

- ఎంపీ కేశినేని శివనాథ్ ఉద్ఘాటన
- 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ - 2025 పోటీలు ప్రారంభం
- ముగింపు వేడుకలకు హాజరు కానున్న సీఎం చంద్రబాబు



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి మణిహారంగా అమరావతిలో స్పోర్ట్స్ యూనివర్శిటీ రానుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. శాప్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం నిర్వహణలో సోమవారం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యోనెక్స్– సన్‌రైజ్ 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 నుంచి 28 వరకు జరిగే పోటీలను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేష్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, స్టార్ షట్లర్ పీవీ సింధు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను వీరంతా స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**స్పోర్ట్స్ కోచ్‌ల తయారీ కేంద్రంగా ఏపీ**

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. శాప్ ఆధ్వర్యంలో నేషనల్ గేమ్స్ కూడా రాష్ట్రానికి రావాలని ఆకాంక్షించారు. నగరానికి 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలు తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘానికి, సెక్రటరీ డాక్టర్ పి.అంకమ్మ చౌదరికి ధన్యవాదాలు తెలిపారు. అతి తక్కువ సమయంలో ఈ పోటీలు నిర్వహించేందుకు స్టేడియంలో అన్ని ఏర్పాట్లు కల్పించిన మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ క్రీడల ముగింపు వేడుకలకు వచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సమ్మతించారని తెలిపారు. రాబోయే రోజుల్లో అమరావతిలో నిర్మించనున్న స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులతో పాటు క్రీడలకు సంబంధించిన అనుబంధ విభాగాల సిబ్బంది కోసం శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేశానికి స్పోర్ట్స్ కోచ్‌లను తయారు చేసే రాష్ట్రంగా ఏపీ తయారవుతుందన్నారు. ఇక శాప్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఆధునీకరణ పనులు జరగబోతున్నాయని, తిరుపతిలో కూడా స్టేడియానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నగరంలో క్రీడాకారులను తయారు చేసే విధంగా మినీ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు శాప్ కృషి చేయాలని సూచించారు. పోటీలో పాల్గొనేందుకు విచ్చేసిన క్రీడాకారులు విజయవాడ అతిథ్యాన్ని స్వీకరించాలని కోరారు.

అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఏపీ రాజధాని అమరావతిలో భాగమైన విజయవాడలో ఈ పోటీలు నిర్వహించటంతో నగరం మరింత ఉత్తేజంగా మారిందన్నారు. గతంలో హైదరాబాద్‌లో స్పోర్ట్స్ విలేజ్ నిర్మించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. శాప్ ఆధ్వర్యంలో జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలు జరగటం ఎంతో ఆనందంగా వుందన్నారు.

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బ్యాడ్మింటన్ గేమ్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడల పట్ల నిర్లక్ష్యం వహించిందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉత్తమ క్రీడా పాలసీని రాష్ట్రంలో అమలు చేస్తున్నారని వివరించారు.

ఈ కార్యక్రమంలో శాప్ ఎండీ ఎస్.భరణి, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎమ్.ద్వారకానాథ్ , సెక్రటరీ డాక్టర్ పి.అంకమ్మ చౌదరి, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, శాప్ డైరెక్టర్ సంతోష్ కుమార్‌తో పాటు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### క్యాడర్‌ను సమన్వయం చేసుకుంటూ..

# పార్టీని మరింత బలోపేతం చేయాలి

**- మండల పార్టీ అధ్యక్షుల శిక్షణా తరగతుల్లో ఎమ్మెల్సీ బీటీ నాయుడు**



అమరావతి (చైతన్యరథం): పార్టీలో క్రమశిక్షణను నిలబెట్టుకుంటూ, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న మండల పార్టీ అధ్యక్షుల శిక్షణలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీటీ నాయుడు.. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మండల అధ్యక్షులకు పలు సూచనలు చేశారు. బూత్ స్థాయి నుండి మండల స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత శక్తివంతంగా తయారు చేయాలన్నారు. స్థానికంగా ఉండే కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి భరోసా కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో మండల అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలన్నారు. పార్టీ పునాది బూత్ స్థాయిలోనే ఉంటుందని, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు పెంపు

**- ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి**



రాయచోటి (చైతన్యరథం): గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు పెంపొందించి రైతులు, విద్యార్థులు, ప్రజలకు మేలు చేకూరేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్ర రాయచోటిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మంత్రి మండిపల్లి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు, అభ్యర్థనలు వింటూ వినతులు స్వయంగా స్వీకరించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. పలువురు తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీ ఇచ్చారు.. ఈ సందర్భంగా అధికారులు నాయకులు దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో మంత్రిని ఘనంగా సన్మానించారు.

# వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట

- **ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ**
- **దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**
- **వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై సమీక్ష**
- **పాల్గొన్న హోంమంత్రి అనిత, అనగాని**



తిరుమల(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్దపీట వేస్తున్నట్లు దేవా దాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో సోమవారం వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు మంత్రుల ఉప సంఘం సభ్యులు హోంశాఖ అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతో కలిసి ఆయన టీటీడీ, జిల్లా, పోలీసు ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.

వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే 10 రోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు అంటే దాదాపు 90 శాతం సామా న్యులకే కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తొలి మూడురోజుల దర్శనాలకు 27 రాష్ట్రాల నుంచి 23.64 లక్షల మంది ఈ-డిప్‌కు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 1.89 లక్షల మంది సామాన్య భక్తులకు ఈ-డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు జరిగింది. భక్తులు ఏరోజు, ఏ సమయానికి దర్శనానికి రావాలో సమాచారం అందజేశాం. టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుంచి 8 వరకు సర్వ దర్శన క్యూలైన్ ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలకు అవకాశం కల్పించి నట్లు తెలిపారు. స్వామివారి దర్శనాలకు విచ్చేసే భక్తులకు విరి వివిగా అన్నప్రసాదాలు, తాగునీరు, తదితర సదుపాయాలు కల్పిం చినట్లు చెప్పారు. ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తుల సంఖ్య, వేచి ఉండే సమయాన్ని అంచనా వేస్తూ క్యూలైన్ల నిర్వ హణ ఉంటుందని తెలిపారు. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులకు పూర్తిస్థాయిలో సంతృప్తి కలిగేలా నిబద్ధతతో సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, దేవాదాయశాఖ సెక్రటరీ హరిజవహర్‌లాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బ రాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గుంతలు లేని రోడ్లు ప్రభుత్వ సంకల్పం

- **నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికీ రోడ్డు వేయిస్తా**
- **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకుంటాం**
- **అమరావతి- మచిలీపట్నం మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి**
- **ఎన్‌హెచ్-65 రోడ్డు అభివృద్ధికి భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన రోడ్డు సదుపాయం కల్పించి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో నేషనల్ హైవే 65లో భాగంగా ఉన్న మూడు స్తంభాల సెంటర్ నుండి కోనేరు సెంటర్ వరకు ఉన్న 1.20 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి భూమిపూజ చేశారు. సుమారు రూ.1.38 కోట్ల వ్యయంతో 10 మీటర్ల వెడల్పులో రోడ్డును విస్తరించబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి అభివృద్ధి నివేదికను సిద్ధం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.3.50 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో ప్యాచ్ వర్కులతో రోడ్లను గుంతలు లేకుండా తీర్చిదిద్దామన్నారు. తర్వాత రూ.8.90 కోట్లతో పలు రోడ్లను అభివృద్ధి చేశాం. మరో రూ.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆర్ అండ్ బీ మంత్రి నుండి ఆమోదం లభించింది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన రోడ్డు పనుల్ని చేశామని మంత్రి రవీంద్ర తెలిపారు.

**ప్రతి గ్రామానికి రోడ్డు సదుపాయం**

త్వరలోనే చిన్నాపురం నుండి కమ్మవారి చెరువు రోడ్డు, తాళ్లపాలెం రోడ్డు పనుల్ని కూడా పూర్తి చేస్తాం. మరో రూ.69 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. ఆ నిధులు కూడా వస్తే నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ప్రాంతానికి రోడ్డు సదుపాయం కల్పిస్తాం. విజయవాడ రోడ్డు విస్తరణకు ప్రజలు కూడా మద్దతుగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉంది. అత్యంత సుందరంగా రోడ్డును నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. మురుగు నీటి వ్యవస్థను మెరుగు పర్చేందుకు రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. హ్యామ్, అమృత్ 2.0 వంటి పథకాలతో చేయాల్సిన అభివృద్ధి పనుల్ని పూర్తి చేస్తాం. తాగునీరు, డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తున్నాం. పంచాయతీ రాజ్ శాఖ నుండి రూ.20 కోట్లు కేటాయించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లోని డ్రైనేజీని అభివృద్ధి చేస్తామని మంత్రి రవీంద్ర హామీ ఇచ్చారు.

మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేసుకుంటున్న క్రమంలో.. రోడ్ల నిర్మాణం కూడా అత్యంత కీలకంగా మారబోతోంది. నాబార్డు నిధులతో అమరావతి-మచిలీపట్నం మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారిని అభివృద్ధి చేయబోతున్నాం. ఇప్పటికే విజయవాడకు ఆరులైన్ల రోడ్డు మార్గం ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం నుండి 12 వరుసల విస్తరణకు కేంద్రానికి ప్రతిపాదనలు అందాయి. అదే సమయంలో మచిలీపట్నం-రేపల్లె-నడికుడి మీదుగా తెలంగాణకు రైలు మార్గం అభివృద్ధికి ప్రతిపాదనలు వచ్చాయి. రైల్వే మంత్రిత్వ శాఖ కూడా సుముఖంగానే ఉంది. త్వరలోనే రైల్వే, నేషనల్ హైవే సంస్థలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ ప్రణాళికలను ప్రకటిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# భక్తులకు జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- **అవినీతికి ఆది పురుషుడు ఆయన**
- **పరకామణి దొంగతనాన్ని సమర్థిస్తారా?**
- **హిందూ మతంపై దాడి చేయడమే వారి ఎజెండా**
- **నాడు తలనీలాలను అక్రమంగా తరలించారు**
- **బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్**



మంగళగిరి (చైతన్యరథం): పరకామణి దొంగతనాన్ని సమర్థిం చిన జగన్ క్షమాపణ చెప్పాలని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయం లో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పరకా మణి అంటే వెంకటేశ్వరస్వామికి భక్తులు ఇచ్చే కానుకలు. భక్తిశ్రద్ధలతో, కష్టపడి సంపాదించిన డబ్బు, బంగారం, నిలువు దోపిడీ, తలనీలాలు వంటివి దేవుడికి సమర్పించుకుంటారు. కొందరు మొక్కు కోరికలు తీరితే తలనీలాలు ఇస్తామని ప్రతిజ్ఞ చేసి పసుపు గుడ్డలో డబ్బులు దాచుకుని వచ్చి హుండీలో వేస్తారు. ఇవ న్నీ భక్తుల భక్తి విశ్వాసాలు. బ్రిటిష్ వారు కూడా వెంకటేశ్వర స్వామిపై భక్తి, గౌరవంతో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అభివృద్ధి చేశారు. 1939లో టీటీడీ పేరుతో పాలక మండలి ఏర్ప డింది. ఇప్పటికీ దాదాపు 90 ఏళ్లు అయింది. కలియుగంలో ప్రజల కష్టాలను, నష్టాలను అక్రమవాదుల నుంచి కాపాడటానికి వెంకటేశ్వరస్వామి వారు దేవదేవుడి రూపంలో అవతరించారు. అలాంటి స్వామివారికి సంబంధించిన కానుకలనే దోచేశారు. ఇంతకు ముందు ఎన్నడూ జరగని విధంగా అక్రమాలు జరిగాయి. పరకామణిలో జరిగిన అక్రమాలు, దేవదేవుడిపై జరిగిన కుట్రలు నన్ను తీవ్రంగా కలిచివేశాయి. వైసీపీ హయాంలో రూ.2 కోట్ల విలువైన తలనీలాలు మయన్మార్, థాయ్‌లాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా హిందూ మతంపై దాడి చేయడమే వారి ఏకైక ఎజెండా. పరకామణి కేసులో రవికుమార్ డబ్బు దోచేశాడు.. వైసీపీ నాయకులు సెటిల్‌మెంట్ చేశారు. రూ.40 వేల కోట్లు దోచేసిన వ్యక్తి..25 ఏళ్లకు మందుబాబుల డబ్బును తాకట్టు పెట్టిన వ్యక్తి.. అవినీతికి ఆది పురుషుడు జగన్మోహన్‌రెడ్డే. అవినీతి గురించి పుస్తకం రాయాలంటే ఆయనతో మొదలు పెట్టాలి. రాజకీయ అవినీతిలో మొదటి ర్యాంక్‌లో ఆయనే ఉంటాడు. మత విశ్వాసాలు ఉన్నవాడు ఎవరైనా పరకామణి దొంగతనాన్ని చిన్న తప్పుగా భావిస్తాడా? దేవుడి డబ్బు దోచి లోక్ అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవడం అనేది కొత్త పంచాయితీ. దొంగతనాన్ని లీగలైజ్ చేసి, కొంత డబ్బు తిరిగి తీసుకుని మిగతా దోచేస్తాం అన్న సిద్ధాంతం ఇది. అవినీతి డబ్బును లీగలైజ్ చేయ డం జగన్మోహన్‌రెడ్డికి అలవాటు. 2004-14 మధ్య తండ్రి అధికారంలో ఉన్నప్పుడు, 2019-24లో వేల కోట్లు దోచేసి దోపిడీని లీగలైజ్ చేశాడు. అందుకే పరకామణి దొంగతనం చిన్న దొంగతనంగా కనిపిస్తుంది. రూ.11 దొంగిలించినా, రూ.11 కోట్లు దొంగిలించినా చట్టం ప్రకారం నేరమే. నేరస్తుని సమర్థిం చడం కూడా పెద్ద నేరమే. పరకామణి కేసులో ఆస్తుల రిజి(స్ట్రేషన్ డబ్బు ఎవరు కట్టారు? ఢిల్లీలో ఉన్న ధర్మారెడ్డి సంతకాలు పెట్టారు. ఏమైనా తెలుసా అంటే "తెలియదు" అంటాడు. ఆ రోజు ఏం చేస్తున్నాడు? గాడిద పళ్లు తోముతున్నాడా? బాబాయి గొడ్డలిపోటు రహస్యాలు తెలిసిన వారి కథ ఎలా ముగిసిందో పరకామణి కేసులో కూడా అదే జరుగుతోంది. గతంలో పరిటాల రవి హత్య కేసులోనూ, వివేకా హత్య కేసులోనూ ఇదే విధానాన్ని అనుసరిం చారు. వారి లక్ష్యం ఒక్కటే.. 100 శాతం నేరాన్ని 0 సాక్ష్యం లేకుండా చేయడం వైసీపీ డీఎన్‌ఏలోనే ఉంది. ఘటన జరిగిన కొన్ని గంటలకే పోలీసుల విచారణ పూర్తి కాకుండా భూమన ఆత్మహత్య అని ప్రెస్‌మీట్‌లో చెప్పారు..దానికి ఆధారాలు ఏమిటి? ఆయన క్రైస్తవుడు.. వెంటకటేశ్వర స్వామి విగ్రహాన్ని నల్ల రాయితో పోల్చాడు..కానీ టీటీడీ చైర్మన్ పదవి కోసం హిందూ ముసుగు వేసుకున్నాడు. కలియుగ బ్రహ్మాండ నాయకుడి దర్శనం తర్వాత భక్తితో తీసుకునే పవిత్ర తిరుమల లడ్డూను కల్తీ చేశారు. ఇది భక్తి విశ్వాసాలపై దాడి. చంద్రబాబు టీటీడీ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని అనడానికి కరుణాకర్‌రెడ్డికి అర్హత లేదు. వైసీపీ ప్రభుత్వం 24-11-2021న అలిపిరి నుంచి చెర్లోపల్లి మధ్య పశ్చిమాన ఒబెరాయ్ హోటల్‌కు 25 ఎకరాలు కేటాయించే జీవో 24 విడుదల చేసింది. ఇది వాస్తవం కాదా? చంద్రబాబు ఆస్తులు దోచలేదు..బాధ్యతగా పరిరక్షించారు. దేవుడిని దోచిన దొంగను దోచుకున్న గజదొంగలు వైసీపీ ముఠా. మత విశ్వాసాలపై ఆడు కునే వ్యక్తి ఈ రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఒక్కడే. ఏ మతాన్నైనా తన అవసరానికి వాడుకుంటాడు.. దొంగతనాలు చేస్తారు.. దోపిడీలు చేస్తారు..హత్యలు చేస్తారు, టీవీ ఫుటేజ్ మాయం చేస్తారు, విజిలెన్స్ రిపోర్టులు మాయం చేస్తారు. దేవుడినే దోచేస్తే కలియుగ స్వామి ఊరుకుంటాడా? త్వరలోనే పరకామణి కేసులో భుజాలు తడుముకుంటున్న గజదొంగల చరిత్ర వెలుగులోకి వస్తుంది? కానీ దేవుడినే దోచేసిన వైసీపీ దొంగలను ప్రజలు క్షమించరని హితవుపలికారు.

# అందరూ మెచ్చిన ఆదర్శనేత వాజ్‌పేయి



**- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు**

భీమవరం (చైతన్యరథం): దేశ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శ్రీకారం చుట్టారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాంగ్రెసేతర ప్రధానిగా అందరూ మెచ్చిన నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ర్యాలీలో రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి గురించి నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. రాజకీయాలంటే కేవలం అధికారం సంపాదించుకోవడమే కాదని, ప్రజలకు నిరంతరం సేవ చేయాలని చెప్పి.. చేసి చూపించిన ఆదర్శ నాయకుడు వాజ్‌పేయి అన్నారు. అందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లే మంచి సేవ చేయొచ్చని నిరూపించిన నేత ఆయన. అణు పరీక్షలు చేస్తే భారత్‌పై ఆంక్షలు విధిస్తామని ఇతర దేశాలు హెచ్చరించినా ధైర్యంగా నిలబడ్డారు. మా దేశానికి ఏం కావాలో మేం నిర్ణయించుకోగలమని స్పష్టం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత ఆయనది. దేశంలోని మిగతా ప్రాంతాలతో సమానంగా అక్కడ కూడా అభివృద్ధి చేశారు. చంద్రయాన్‌కు పునాది వేసిన దార్శనికుడు వాజ్‌పేయి. ఆయనతో సీఎం చంద్రబాబుకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. రోడ్లు, ఐటీ రంగాల్లో అప్పట్లో వీరిద్దరూ కీలక నిర్ణయాలు తీసుకున్నారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలు వేగంగా పరిష్కరించాలి

***- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్***



**- సమస్యల పరిష్కార వేదిక కౌంటర్ పరిశీలన**

**- తిరుపతి కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ**

తిరుపతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల ప్రజా వేదికకు అధిక ప్రాధాన్యత వస్తుందని, అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కారం చూపాలని స్టాంప్స్, అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలి పారు. సోమవారం జిల్లా పర్యటన నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మంత్రికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమ స్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల సమస్యలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని తెలిపారు. అర్జీదారులు మంత్రికి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న ఆయన పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కౌంటర్లను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుతో కలిసి పరిశీలించారు. కౌంటర్‌లో అర్జీదారుల రసీదులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్న సిబ్బందిని, వెబ్‌సైట్‌లో నమోదు చేసే విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే సిబ్బంది అర్జీదా రుల దరఖాస్తులను జాగ్రత్తగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు.

# కరెంటోళ్ల జనబాటకు శ్రీకారం

**- విద్యుత్ సమస్యల పరిష్కారానికే కార్యక్రమం**

**- రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌కు ప్రోత్సాహం**

**- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**- మొగరాల వద్ద నూతన సబ్‌స్టేషన్ ప్రారంభం**

**- 50 మందికి కారుణ్య నియామక పత్రాలు**



తిరుపతి (చైతన్యరథం): ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో కరెంటోళ్ల జనబాట కార్యక్ర మాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. తిరుపతి జిల్లా పాకాల మండలం మొగరాల గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం కరెంటోళ్ల జనబాట పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పాకాల మండలం మొగరాల గ్రామం వద్ద నూతన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. రూ. 4.09 కోట్ల వ్యయంతో నిర్మించిన నూత న సబ్ స్టేషన్ ప్రారంభంతో ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఎదుర వుతున్న లో వోల్టేజ్ సమస్యల నివారణకు మార్గం సుగమమ వుతుందని తెలిపారు.

**50 మందికి కారుణ్య నియామక పత్రాలు**

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో కారుణ్య నియామకాల కింద 50 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేటర్ కార్యాలయ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు కే.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, కె.రామమోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఎన్.శోభా వాలెంటీనా, పీహెచ్.జానకిరామ్, కె.ఆదిశేష య్య, పి.సురేంద్రనాయుడు, ఆర్టీవో రామ్మోహన్, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

# రైతు ఆదాయం పెంపుతోనే అసలైన అభివృద్ధి

**- మచిలీపట్నంలో గోదాం నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం(చైతన్యరథం): రైతుకు మెరుగైన ఆదాయం కల్పించినప్పుడే అసలైన అభివృద్ధి సాకారమైనట్లు అని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన రెండు గోదాముల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోం దని తెలిపారు. పంట పండించిన రైతు గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకునేందుకు వీలుగా మార్క్ ఫెడ్ నిరంత రం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో తొలిసారి రూ.6.50 కోట్ల వ్యయంతో మచిలీపట్నంలో గోదాము లు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడంతో పాటుగా, ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టడం మరింత ఆవశ్య



కరమన్నా రు. ఇలాంటి గోదాముల కారణంగా రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించొచ్చునన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా గోదాములు నిర్మించాలని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజును సూచిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కార్పొరేటర్ అనిత, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచె నాని తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనలో ఏపీకేవీఐబీ సేవలు భేష్

- **రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అభినందనలు**
- **లక్ష్యానికి మించి పీఎంఈజీపీ యూనిట్ల ఏర్పాటుపై హర్షం**
- **ఎమ్మెల్యేలతో సమన్వయంతో మరిన్ని యూనిట్ల ఏర్పాటుకు అవకాశం**
- **స్వయం ఉపాధి రుణాలపై జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి**
- **మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం**
- **యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యం**

అమరావతి (చైతన్యరథం): యువతకు ఉపాధి కల్పనలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (ఏపీకేవీఐబీ) కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అభినందించారు. స్వయం ఉపాధి యూనిట్ల మంజూరులో స్థానిక ప్రజాప్రతినిధులు, ఏపీకేవీఐబీ అధికారులు సమన్వయంతో పనిచేసి, అర్హులైన నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ఖాదీ క్లస్టర్ల ఏర్పాటుకు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏపీకేవీఐబీ సీఈవో కె.సింహాచలం, ఇతర అధికారులతో మంత్రి సవిత సోమవారం సమీక్ష నిర్వహించారు. ఏడాదిలో ఏపీకేవీఐబీ ఆధ్వర్యంలో ఏర్పాటైన యూనిట్ల వివరాలను మంత్రి సవితకు సీఈవో సింహాచలం వివరించారు. 2025-26లో కేంద్ర ప్రభుత్వం



1,060 యూనిట్ల ఏర్పాటుకు టార్గెట్ పెట్టగా, లక్ష్యానికి మించి 3,595 యూనిట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు రూ.39.20 కోట్లను మార్జిన్ మనీగా అందించామన్నారు. 3,595 యూనిట్లతో 39,545 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, కొవ్వొత్తుల తయారీ, ఆకులతో కప్పులు, ప్లేట్ల తయారీపై శిక్షణ అందజేస్తున్నామన్నారు.

**సీఎం చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా..**

లక్ష్యానికి మించి యూనిట్లు ఏర్పాటు చేయడంపై ఏపీకేవీఐబీ సిబ్బందిని మంత్రి సవిత అభినందించారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఏపీకేవీఐబీ ఆధ్వర్యంలో ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) ద్వారా యూనిట్ల ఏర్పాటుపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో ఏపీకేవీఐబీ సిబ్బంది సమన్వయం చేసుకోవాలని, ఆయా యూనిట్ల ఏర్పాటుపై మీడియా సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి సవిత ఆదేశించారు. యూనిట్ల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలపై ఆయా సమావేశాల్లో, సదస్సుల్లో వివరించాలన్నారు. సోషల్ మీడియాలోనూ స్వయం ఉపాధి పథకాల యూనిట్ల ఏర్పాటుపై ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఇంతవరకూ ఏర్పాటైన యూనిట్ల లబ్ధిదారులతో త్వరలో భారీ సమావేశం నిర్వహిద్దామన్నారు. వారు ఏ మేరకు లబ్ధిపొందారో ఆ సమావేశంలో వివరించడం ద్వారా మరింత మంది యువత పీఎంఈజీపీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే అవకాశముంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వీలైనంత ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.

**ఖాదీ క్లస్టర్ల ఏర్పాటుకు కృషి**

రాష్ట్రంలో ఖాదీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని ఏపీకేవీఐబీ సీఈవో సింహాచలాన్ని మంత్రి సవిత ఆదేశించారు. అవసరమైతే, తాను కూడా ఢిల్లీ వచ్చి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి, రాష్ట్రంలో ఖాదీ క్లస్టర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో నిర్లక్ష్యం చూపొద్దన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ కేకే చౌదరి, బోర్డు సభ్యులు తిరుపతి కుమార్, సాంబశివరావు, శ్రీనివాసరావు, శిరీష దేవి, ఏపీకేవీఐబీ అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత అనంతబాబు పేరుతో బెదిరింపులు

- కత్తులతో దాడి చేసి గాయపరిచారు
- పట్టా స్థలంలో వైసీపీ సర్పంచ్ దౌర్జన్యం
- ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కృష్ణా డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం అర్జీలు స్వీకరించారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టి పల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌నాయుడు సమస్యను వివరిస్తూ తమ గ్రామం లో పట్టా భూమి అయిన 18 సెంట్ల స్థలంలోకి గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకుడు మాదినేని ఈశ్వరయ్య వంక నీటిని దౌర్జన్యంగా మళ్లించి తీవ్ర నష్టం కలిగిస్తున్నాడు. ఇప్పటికే కొంత భాగంలో రోడ్డు నిర్మాణం జరిగి మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. సర్వే కోసం రూ.10,000 కూడా చెల్లించినా న్యాయం జరగలేదు. తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

**టీడీపీలో తిరిగితే చంపేస్తామంటున్నారు**

అల్లూరి జిల్లా గంగవరం మండలం పిడతమమిడి గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో పొలం నుంచి ఇంటికి వస్తుండగా ప్రధాన రహదారిపై యెజ్జు రామకృష్ణ, యెజ్జు వెంకటేశ్వరరావు, బాలిగి వీరబాబు, తుమ్మల చిన్ని బాబు, జగ్గ నూకరాజు అనే వ్యక్తులు పక్కా పథకం ప్రకారం తనను అడ్డగించారు. టీడీపీలో తిరిగితే నిన్ను, నీ కుటుం బాన్ని చంపేస్తాం. మాకు వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు, ఉదయ భాస్కర్ పూర్తి మద్దతు ఉంది. నీ కోసం 20 నుంచి 30 లక్షల రూపాయలు ఖర్చు చేయడానికైనా వెనుకాడమంటూ బెది రించారు. అంతటితో అగకుండా కత్తులతో దాడికి దిగారు. ఈ దాడిలో ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నాను. ఎడమ చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ రక్షణ కల్పించాలని కోరాడు.

**భూమి మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేశారు**

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం బొడ్డువానిపల్లె గ్రామానికి చెందిన అక్కలరెడ్డి మహానందిరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ తల్లి అక్కలరెడ్డి తిరుమలమ్మకు రెడ్డిచెర్ల ఇలాకాలోని ఖాతా నెం.1261, సర్వే నెం.10, ఎ.1.54 సెంట్లు భూమి వారస త్వంగా వచ్చింది. ఈ భూమి 2016-2019 వరకు ఆన్‌లైన్ రికార్డుల్లో తమ తల్లి పేరుపైనే ఉంది. కొవిడ్ సమయంలో జూలై 2020లో గ్రామానికి చెందిన ధనిరెడ్డి పుల్లారెడ్డితో తహశీల్దార్, వీఆర్వో కలిసి అక్రమంగా రికార్డులు మార్చి, 0.51 సెంట్లు భూమి ని అతని పేరుపై ఆన్‌లైన్ చేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో తాను టీడీపీ కార్యకర్తను అన్న కారణంతో తమ భూమిని కబ్జా చేయడానికి ఈ అక్రమ మార్పులు జరిగాయి. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**అకారణంగా తొలగించారు**

కృష్ణా జిల్లా గన్నవరం మండలం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన పద్మావతి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. రామవ రప్పాడు గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేసిన తనను 2021లో ప్రసాదంపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన కారణంగా రాజకీయ ప్రతీకారంతో ఉద్యోగం నుంచి అక్రమంగా తొలగించారు. అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు, అధికారులు కుమ్మక్కై తన నామినేషన్‌ను అన్యాయంగా తిరస్కరించారు. ఈ అన్యాయంపై విజయవాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేయగా ఆ కేసును ఉపసంహరించుకోవాలనే ఉద్దేశంతో తనను పని నుంచి తీసివేసి బెదిరింపులు, దాడులు చేయించారు. పోలీసులూ రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోయి తనకు రక్షణ కల్పించలేదు. జక్కంపూడి హౌసింగ్ స్కాం, అక్రమ కట్టడాలు, లేని పారిశుధ్య కార్మికులను చూపించి ప్రజాధనం దోచుకున్న అవినీతిపై ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. వారిపై చర్యలు తీసుకుని తమ ఉద్యోగాన్ని తిరిగి కల్పించాలని కోరారు.

## జనవరి 8 నుంచి విజయవాడలో

# ఆవకాయ్ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం

- అమరావతి వైభవం చాటిచెప్పేలా కార్యక్రమాలు
- పున్నమి ఘాట్, భవానీ ఐల్యాండ్‌లో నిర్వహణ
- సందర్శకులకు ప్రవేశం ఉచితం
- సాంస్కృతిక భాగస్వామ్యానికి తొలిమెట్టు ఫెస్టివల్
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్




అమరావతి (చైతన్యరథం): తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటిచెప్పేలా కూటమి ప్రభుత్వం విజయవాడ వేదికగా జనవరి 8 నుంచి 10 వరకు ఆవకాయ్ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం పేరిట వినూత్న సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేసిందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వెలగపూడి సచివాలయం 4వ బ్లాక్‌లోని పబ్లిసిటీ సెల్ విభాగంలో సోమవారం పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, టీమ్ వర్క్ ఆర్ట్స్ కంపెనీ ప్రొడ్యూసర్ శ్యామ్‌తో కలిసి ఆవకాయ్ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవంపై పలు అంశాలను వివరించారు. ఏపీ పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 8 నుంచి 10 వరకు మూడు రోజుల పాటు విజయవాడ కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్ , భవాని ఐలాండ్‌లలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివ రించారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన కథా సంప్రదాయాలు, సినిమా, సాహిత్యం, ప్రదర్శన కళలను ఘనంగా చాటాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల దార్శని కతలో భాగంగా ఈ ఉత్సవం రూపుదిద్దుకుందన్నారు. కేవలం ఇండోర్ హాల్స్‌కే పరిమితం కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం దీని ప్రత్యేకతగా మంత్రి పేర్కొ న్నారు. తెలుగు కథలు, సినిమాలకు జాతీయ స్థాయిలో పెరుగు తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని అమరావతి-విజయవాడ ప్రాంతాన్ని ఒక సమకాలీన సాంస్కృతిక రాజధానిగా మార్చడమే ఈ పండుగ లక్ష్యమని తెలిపారు. ఈ ఉత్సవం ఆంధ్రప్రదేశ్ వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, స్థానిక కళాకారులకు, కళాభిమానులకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుంద న్నారు. సినిమా, సాహిత్యం, సంగీతం, నాటకరంగం, సాంస్కృతిక చర్చలను ఒకే బహిరంగ వేదికపైకి తెచ్చి ఆంధ్రప్రదేశ్‌ను సాంస్కృతిక మార్పిడికి, కళాత్మక భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా అమరావతి ఫెస్టివల్ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు ప్రవేశం ఉచితమని తెలిపారు.

**సినీ పరిశ్రమ సమస్యలపై త్వరలో సమావేశం**

ఈ వారంలో మొదట సినిమాటోగ్రఫీ శాఖ నేతృత్వంలో ఉన్న తాధికారుల సమావేశం నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉన్నతాధికారుల సమావేశం తర్వాత సినీ ప్రముఖులతో సమావేశం అవుతామని చెప్పారు. త్వరలోనే తేదీల ను ప్రకటిస్తామని తెపారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఆవకాయ్ మంచి వేదికగా పేర్కొన్నారు. ఆర్గనైజర్లు మాట్లాడుతూ కవిత్వం, ముషాయిరా (తెలుగు, ఉర్దూ), నృత్యం, సంగీతం, థియే టర్‌లపై, తోలు బొమ్మలాట, నృత్యం, సంగీతం, నాటకరంగంపై శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. హెరిటేజ్ వాక్ (వారసత్వ యాత్రలు), ఘాట్ ఫెర్రీ ప్రయాణాలు, రుచికరమైన స్థానిక వంటకాలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.



# సైబర్ నేరాల కట్టడికి సాంకేతిక నైపుణ్యం

- ప్రజా అవగాహనే ఆయుధాలు
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ సెంటర్ ప్రారంభం

విజయవాడ(చైతన్యరథం): టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అంతే స్థాయిలో సైబర్ నేరాల ముప్పు కూడా పెరు గుతోందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రజల్లో అవగాహన కూడా చాలా ముఖ్యమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. సోమవారం సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, కేవీ రావు సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన కేవీ రావు సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్ విభాగాన్ని స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ దేశం డిజిటల్ యుగంలోకి అడు గుపెడుతున్న తరుణంలో బ్యాంకింగ్, ఆరోగ్యం, పాలన వంటి ప్రతి రంగం టెక్నాలజీపై ఆధారపడి ఉందన్నారు. నేరం జరిగిన తర్వాత నిజాన్ని వెలికితీయడానికి డిజిటల్ ఫోరెన్సిక్, నేరం జర గకుండా అడ్డుకోవడానికి సైబర్ సెక్యూరిటీ కీలకమని తెలిపారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ సంపాదించి దేశ భద్రతలో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. పోలీస్, న్యాయ వ్యవస్థ, ఐటీ రంగాల్లో సైబర్ నిపుణులకు భారీ డిమాండ్ ఉందన్నారు.

ప్రస్తుతం సైబర్ మోసాలు చాక చక్యంగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయడం, ఓటీపీలు చెప్పడం, లాటరీల పేరుతో వచ్చే మెసేజ్‌లను నమ్మడం వల్ల బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకుండా వెరిఫికేషన్ చేసు కోవాలన్నారు.ఈ కేంద్రం ద్వారా స్వర్ణాంధ్ర 2047, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు యువత తమ శక్తిని వినియో గించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సిద్ధార్థ అకాడమీ మేనేజ్‌మెంట్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల పాలిట కల్పతరువు సీఎంఆర్ఎఫ్

**బనగానపల్లెలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



బనగానపల్లె (చైతన్యరథం): పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ కింద దాదాపు రూ.8.50 లక్షల విలువైన చెక్కులను 25 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వైద్య సహాయం పొందిన రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వారి యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూటమి పాలనలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి - సంక్షేమ పథకా లు అందుతున్న తీరుపై ఆరా తీశారు. పేదల పాలిట కల్పతరువు. సీఎం రిలీఫ్ ఫండ్ అని, నిరుపేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వంలో కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిది నిలుస్తుందని తెలిపారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్య సహాయం అందుతున్నట్లు తెలిపారు.

# ప్రపంచంలోనే టాప్ 5లో అమరావతి

- జనవరి నుంచి 29 గ్రామాల్లో మౌలిక వసతులు
- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- రాజధాని గ్రామం వడ్లమానులో రోడ్డు ప్రారంభం



అమరావతి(చైతన్యరథం): రాజధాని గ్రామం వడ్లమానులో సోమవారం మంత్రి పొంగూరు నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని మంత్రి నారాయణ ప్రారంభించారు. రైతుల వినతితో కేవలం వారంరోజుల్లోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో గ్రామస్తులు ఆయనను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రపంచంలో టాప్ 5 లో ఉండేలా నిర్మిస్తున్నామని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తాం. గ్రామస్తులు అడిగిన వెంటనే వారంరోజుల్లోనే కొత్త రోడ్డు నిర్మించాం. రూ.98.7 లక్షలతో 1148 మీటర్ల రోడ్డును యుద్ధప్రా తిపదికన నిర్మించినట్లు చెప్పారు. రాజధానిలోని 29 గ్రామాల్లో జనవరి నుంచి మౌలికవసతుల పనులు చేపడతామని వివరించారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తాం. ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ, రైల్వే లైన్, రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటాం. ల్యాండ్ పూలింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. ల్యాండ్ పూలింగ్‌కు ఎవరైనా ముందుకు రాకుంటే అప్పుడు భూసేకరణపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో గురుకులాలు

- పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- మోపిదేవిలో ముస్తాబు కార్యక్రమం ప్రారంభం




మచిలీపట్నం(చైతన్యరథం): విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తూ ఆరో గ్యంగా ఉండాలని బీసీ ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. సోమవారం మంత్రి అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవిలో మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ సంక్షేమ వసతి గృహంలలో ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన అద్దం, దువ్వెన, చేతులు శుభ్రం చేసుకునే వాష్ బేసిన్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం పాఠశాల, వసతి గృహంలో కలియతిరిగి వంట గదులు, ఆర్వో ప్లాంట్, స్నానపు గదులు, మరుగుదొడ్లు, టీవీలో ముస్తాబు కార్యక్రమం మంత్రి పరిశీలించారు. అంతేకాకుండా ప్రతి ఒక్క విద్యార్థికి దగ్గరకు వెళ్లి వారి వ్యక్తిగత పరిశుభ్రతను, చేతి గోర్లు తీసుకుంటున్నారా లేదా గమనించారు. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా లేదా తెలుసుకున్నారు. బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని అల్పాహారం, చిక్కీ రుచి చూశారు. పులిహోర సరిగా చేయడం లేదని, మరింత మెరుగ్గా ఆహారం తయారు చేయాలని మంత్రి వంటవారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహాత్మజ్యోతిబా బీసీ గురుకుల పాఠశాల అంటేనే ఒక బ్రాండ్ అని, ఎంజేపీలో సీటు దొరకాలంటే చాలా డిమాండ్ ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ ఈ గురుకుల పాఠశాలలను ప్రారంభించారని.. అదే స్ఫూర్తితో గురుకులాలు నడుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అదే లక్ష్యంతో గురుకులాలు అని రంగాల్లో ముందంజలో ఉండాలని విద్యా సంస్థలను తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ముస్తాబు కార్యక్రమంలో భాగంగా ఏకరూప దుస్తులను సజావుగా ధరించి, అద్దం, దువ్వెనను వినియోగించుకుని చక్కగా తల దువ్వుకొని చేతులు శుభ్రం చేసుకుని పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. అందరూ ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించి ఆసుపత్రికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది విద్యార్థులకు ముస్తాబు కార్యక్రమం అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమం ఒక మహత్త రమైన కార్యక్రమం అని తెలిపారు. గురుకులానికి భవనాల కొరత ఉందని, 8 గదులు అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్య తనిచ్చి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు మల్లికార్జున, గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి పి.మాధవిలత, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, మోపిదేవి ఎంపీపీ దుర్గారాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్రబాబు, బీసీ సంక్షేమ అధికారి రమేష్, ప్రిన్సిపాల్ వీరా రవి, వార్డెన్ సురేష్, సర్పంచు మేరీ రాణి పాల్గొన్నారు.

# బ్రాహ్మణులకు గౌరవం కల్పించినది చంద్రబాబే

- పేదల కోసం గరుడా పథకం పునఃప్రారంభం
- త్వరలో ఉచిత సామూహిక ఉపనయనాలు
- వారి సమస్యల పరిష్కారమే సమితి లక్ష్యం
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్



మంగళగిరి(చైతన్యరథం): బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుం దని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం మంగ ళగిరి ఎన్టీఆర్ భవన్‌లో బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బుచ్చి రాంప్రసాద్ మాట్లా డుతూ రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యలపై నిరం తరం పోరాటం చేసి వాటి సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత బ్రాహ్మణ సాధికార సమితిపై ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2014లో బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలు ఏర్పాటు చేసి బ్రాహ్మణ జాతి అభ్యున్నతికి బాటలు వేశారని, అలాగే 2019-2024 మధ్య బ్రాహ్మణ సాధికార సమితి ఏర్పాటు చేయడం ద్వారా బ్రాహ్మణులకు ప్రత్యేక గౌరవం కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ గ్రామస్థాయి నుంచి బ్రాహ్మణ సాధికార సమితిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులకు గరుడా పథకం పునఃప్రారంభించనున్నట్లు తెలి పారు. రానున్న ఉత్తరాయణంలో ఉచిత సామూహిక ఉపనయన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి రోజున వచ్చే ఆది శంకరుల జయంతి (శంకర జయంతి), రామానుజ జయంతిని ప్రభుత్వ పండుగలుగా నిర్వహించేలా ప్రభుత్వాన్ని కోరుతూ సమా వేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేష న్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యులు ఏ.వి.రమణ, టి.వి.శ్రీరామమూర్తి, ఈమని సూర్యనారాయణ, గూడూరి శేఖర్, ఎం.వి.సత్యనారాయణ, చిత్రపు హనుమంతరా వు, గార్లపాటి విజయకుమార్, శ్రీశ్రీ శర్మ, భమిడిపాటి బాబు, శ్రీ హోతా రవి, శ్రీ మల్లికార్జున, శ్రీ టి.వి. రవిచంద్ర శర్మ, సిహెచ్ జనార్దన్, దుర్వాసుల రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



# జెన్‌జెడ్ బ్లాగర్‌కు పవన్‌కళ్యాణ్ అభినందన

*మంగళగిరి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా బైక్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఆధ్యాత్మిక అంశాలను అందరికీ పంచుకుంటున్న జెన్ జెడ్ బ్లాగర్ స్వాతి రోజాను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభినందించారు. ఆమె చేస్తున్న సాహస యాత్ర గురించి వివరా లు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ యాత్రలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సోమవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌ను యువ ట్రావెల్ బ్లాగర్ స్వాతి రోజా మర్యాదపూర్వకంగా కలిశారు. దేశవ్యాప్త పర్యటనలో భాగం గా కొద్ది వారాల క్రితం ఆమె శ్రీశైలంలో పర్యటించినప్పుడు వసతి, భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి. విషయం తెలుసు కున్న పవన్‌కళ్యాణ్ ఆమెకు శ్రీశైలంతో పాటు, తిరుమల, శ్రీకాళహస్తి, విజయవాడ కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. దుర్గమ్మ దర్శనం అనంతరం పవన్‌కళ్యాణ్‌ను కలిసి.. ఆయన చూపిన శ్రద్ధకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీశైలంలో ఎదురైన అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బైక్ రైడింగ్, బైకులపై తనకున్న ఆసక్తిని పవన్ పంచుకున్నారు.*

## ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

**- ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు**



*అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని ప్రతిపక్షాల కుట్రలను టీడీపీ శ్రేణులు దీటుగా తిప్పికొట్టాలని శాసనమండలి ప్రభుత్వ విప్, టీడీపీ మానవ వనరుల విభాగం చైర్మన్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పిలుపు ఇచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం 6వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల్లో టీడీపీ ఆవిర్భావం, భావజాలం, చరిత్ర, సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్ల గురించి ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు కూలంకషంగా వివరించారు. కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలు, సాంకేతికత వంటి ముఖ్యమైన అంశాలపై ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి శిక్షణ అందించారు. వారికి విప్ చిరంజీవిరావు జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మండల పార్టీ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు ఈ శిక్షణలో పాల్గొన్నారు.*

### శ్రీకాళహస్తి దేవస్థానం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

*తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం 2026 క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ పరమశివుని కృపాకటాక్షలు రాష్ట్ర ప్రజలందరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబర్ చిన్నపోల్ల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు చిన్నపోల్ల సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.*

# వంద వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

## సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర



పార్వతీపురం, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి మేమంతా ఆనందం వ్యక్తం చేస్తున్నామని పార్వతీపురం మండలం డోకిశీల పంచాయితీ గిరిజన ప్రజలుఅన్నారు.

సోమవారం డోకిశీల పంచాయతీ గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ సంపంగి జగదీష్, వార్డ్ నెంబర్లు వీళ్లతో పాటు 100 కుటుంబాలు,నీలాపు చంటి, నీలాపు కొండలరావు, వడ్డీ చంటి, సీదారపు రాజు,వేంపటాపు సంబమూర్తి, బలుసు నాగేశ్వరావు,డుంబరి రవి, బొమ్మి గౌరునాయుడుఆధ్వర్యంలో సోమవారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ చంద్ర మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఆ దిశగా ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారికి టీడీపీ ఎప్పుడూ గుర్తింపు నిస్తుందని, మీ అందరికీ సముచిత స్థానాలు కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ సమర్థవంతంగా కూటమి ప్రభుత్వం అమలు చేయడం ఆనందంగా ఉందని, ఇటువంటి అభివృద్ధి గతంలో మేము ఎప్పుడు చూడలేదని అన్నారు. పార్వతీపురం నియోజవర్గంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేస్తున్న అభివృద్ధి పనులు ఎంతో సంతోషదాయకమని, ఆయన చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై టిడిపిలో మేమంతా చేరామన్నారు. ఆయన బాటలో నడుచుకొని మేమంతా మా గ్రామ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారంతా ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొట్టపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అధినేతలకు కృత్ఞలు : కొమ్మాలపాటి



పల్నాడు, (చైతన్యరథం): పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా అవకాశం కల్పించి పల్నాడు ప్రజలకు 20 నెలలు పాటు సేవ చేసే అవకాశాన్నిచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు కొమ్మాలపాటి శ్రీధర్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. లక్ష్య సాధనకు, నారా లోకేశ్ నాయకత్వంలో అనునిత్యం ప్రజా సేవే నాకు ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. 20 నెలలు పాటు నాకు సహకరించిన పార్టీ ఇంచార్జిలు, శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, పల్నాడు జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులకు, అనుబంధ విభాగాల నాయకులకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలకు, బడుగు బలహీన దళిత శ్రామిక కర్షక వర్గాల నాయకులకు, అధికారులకు, అభిమానులకు పేరు పేరున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా పసుపు జెండా ఎగరవేసే మహా యాగంలో నాకు సహకరించిన మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అనకాపల్లి టీడీపీ అధ్యక్షుడికి అభినందనలు



అనకాపల్లి, (చైతన్యరథం): అనకాపల్లి పట్టణం, స్థానిక టీడీపీ కార్యాలయంలో ఇటీవల అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గా నియమితులైన లాలం కాశీ నాయుడు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ని మర్యాద పూర్వకంగా కలిసి తమ నియమాంకానికి కృషి చేసినందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్బంగా అయన వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తికి అభినందనలు



పెనమలూరు, (చైతన్యరథం): పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంటుఅధ్యక్షునిగా బీసీ నాయకులు, రాష్ట్ర గౌడ కార్పోరేషన్ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తిని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పర్యవేక్షణలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చేరువవుతుందని , కూటమి ప్రభుత్వాన్ని బలపడుతుందని ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## ఆకట్టుకున్న చాగంటి ప్రవచనం

విజయనగరం, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీ శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, గారపేట ఆనందాశ్రమంలో మన భారతీయ సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా వేలాది మంది భక్తులతో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమం అయినా మహనీయులు ప్రవచనా శిరోమణి, సరస్వతి పుత్రులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హిందూ ధర్మ పరిరక్షణ ప్రవచనా సందేశ కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం పార్లమెంట్ సభ్యులు శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా మళ్లీ కిమిడి



పార్లమెంట్ పార్టీ అధ్యక్షులుగా మరోసారి నియమించబడిన సందర్బంగా కిమిడి నాగార్జున, నూతనంగా పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమింపబడ్డ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ జిల్లా పార్టీ కార్యాలయం లో పత్రికా సమావేశం నిర్వహించారు. అధిష్టానం నమ్మి ఇచ్చిన పదవికి మరింత వన్నె తెచ్చేలా పని చేస్తామని నాయకులు వెల్లడించారు.



## కాంస్యపతక విజేత
## చిన్నారి షట్లర్ సుహాస్ కందేపికి అభినందనలు

విజయవాడ, (చైతన్యరథం): బీహార్ లో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు జరిగిన యునక్స్ సన్ రైస్ 37వ సబ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్ 2025 లో అండర్ -13 విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరుపున డబుల్స్ ఆడి కాంస్య పతకం సాధించిన సుహాస్ కందేపి ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ లో సోమవారం సుహాస్ కందేపి, తండ్రి ప్రవీణ్ కందేపి తో పాటు ఎంపి కేశినేని శివనాథ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయస్థాయి బాడ్మింటన్ క్రీడలో కాంస్య పతకాన్ని పొందిన సుహాస్ కందేపి కృషి అభినందనీయమంటూ ప్రశంసించారు. కానూరు గ్రామానికి చెందిన సుహాస్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో చదువుకుంటూ, జె.బి.ఎస్ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు. సుహాస్ ఆసక్తిని ప్రోత్సహించిన తండ్రి ప్రవీణ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవ కుమార్ పాల్గొన్నారు.



# బూరుగుపల్లితో బొడ్డు మర్యాదపూర్వక భేటీ

## నిడదవోలులో టీడీపీ శ్రేణుల సాదరస్వాగతం



రాజమహేంద్రవరం, (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన రూడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ శాసనసభ్యుడు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావును ఆయన నివాసానికి విచ్చేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరికి నిడదవోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరిని సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు.




నూజివీడు మండలం, జంగం గూడెం గ్రామంలో. జల్ జీవన్ మిషన్ ద్వారా 28.68 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించబోయే వాటర్ ట్యాంక్ కు రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్ధసారధి శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం 19 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు

# భారతరత్న స్వర్గీయ అటల్ బీహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

## కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి, బీజేపీ అధ్యక్షులు మాధవ్, అన్నామలై

ఏలూరు, (చైతన్యరథం): ఆశ్రమం కూడలిలో ఏర్పాటు చేసిన భారతరత్న స్వర్గీయ అటల్ బీహారి వాజ్‌పేయి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారది రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు అన్నామలై, ఏలురు శాసనసభ్యుడు బడేటి రాధాకృష్ణ, దెందులూరు శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ ఉంగుటూరు బిజెపి ఇంచార్జ్ శరణాల మాలతీరాణి, గారపాటి సీతారామాంజనేయులు (తపనా చౌదరి) జిల్లా బీజేపీ నాయకులతో కలిసి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.






# అధినేత నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

# కార్యకర్తలకు అండగా ఉంటా

### కాకినాడ జిల్లా కొత్త అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్



కాకినాడ, (చైతన్యరథం): కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన జ్యోతుల నవీన్ కుమార్ గారు సోమవారం ఉదయం తన కృతజ్ఞతా పర్యటనను అత్యంత ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ కుమార్ గారు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మరియు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన సామర్థ్యంపై నమ్మకంతో వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి, జిల్లాలో పార్టీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.పర్యటన ప్రారంభానికి ముందు జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ ఆశీస్సులు తీసుకున్న నవీన్ కుమార్ , అనంతరం అన్నవరం రత్నగిరి సత్యదేవుని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం తర్వాత వాహనాలతో భారీ కార్ల ర్యాలీగా బయలుదేరిన ఆయనకు జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ర్యాలీలో భాగంగా జిల్లాలోని ఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. తుని నియోజకవర్గం తేటగుంట క్యాంప్ కార్యాలయం లో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు గారిని కలిసి ఘనంగా సత్కరించి ఫోటో ఫ్రేమ్ అందించి ధన్యవాదములు తెలియజేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభని, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పని,అనంతరం పిల్లి సత్యనారాయణ మూర్తి, అనంతలక్ష్మి దంపతులను మరియు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుని , టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి ని కలిసి కృతజ్ఞతలు తెలియజేసి ఫోటో ఫ్రేమ్స్ జ్ఞాపికగా అందచేశారు. ముగింపులో ఆయన మాట్లాడుతూ.. "జిల్లాలోని ఎమ్మెల్యేలను, నియోజకవర్గ ఇంచార్జ్‌లను, నాయకులను కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను. కార్యకర్తలే పార్టీకి ప్రాణవాయువు. రెండోసారి నాకు దక్కిన ఈ బాధ్యతతో మరింత ఉత్సాహంతో పనిచేసి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరుస్తాను. ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు మంత్రి కొలుసు శ్రీకారం

నూజివీడు, (చైతన్యరథం): నూజివీడు మండలం, తుక్కులూరు గ్రామంలో నూతనంగా జల్ జీవన్ మిషన్ ద్వారా 37.56 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించబోయే వాటర్ ట్యాంక్ కు రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం 25.5 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



# మహిళా సంఘాలకు అండగా కేశినేని ఫౌండేషన్

## విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్

విజయవాడ, (చైతన్యరథం): ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్వుఇండియా ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో మెప్మా ఎస్.హెచ్.జి మహిళలకు చెదలు-బొద్దింకలు-దోమల నివారణ పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ప్రారంభమైంది. డిసెంబర్ 22 నుంచి 24 వరకు సాగే ఈ శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందేందుకు 50 మంది మెప్మా ఎస్.హెచ్.జి మహిళలు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎన్.ఐఆ.ర్.డి ఎన్.టి.ఆర్ జిల్లా రూరల్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు 400 మంది రూరల్ ఎస్.హెచ్.జి మహిళలను 4 బ్యాచ్ లుగా హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి పంపించి వివిధ స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇప్పించటం జరిగిందన్నారు. త్వరలోనే పుట్టగొడుగుల పెంపకం, బంజారా డ్రెస్ తయారీ, బంజారా జ్యూయలరీ తయారీ పై కూడా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. శిక్షణ ఇప్పించటంతో పాటు యూనిట్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తామన్నారు. అలాగే మెప్మా, డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కి సపోర్ట్ అందిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని మెప్మా, డ్వాక్రా సంఘాలకు కేశినేని ఫౌండేషన్ అండగా, తోడుగా నిలబడుతుందని స్పష్టం చేశారు. వారు తయారు చేసే ఉత్పత్తులకు కావాల్సిన మార్కెటింగ్ సపోర్ట్ అందిస్తామని తెలిపారు. డిసెంబర్ 24 వ తేదీ జరిగే ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ ముఖ్యఅతిథులుగా రానున్నట్లు వెల్లడించారు.అనంతరం రాజ్య సభ ఎంపీ సానా సతీష్ బాబు, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమైన ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త వుండాలన్న నినాదం స్ఫూర్తితో ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో ఎన్టీఆర్ జిల్లాలో ఎస్.హెచ్.జి మహిళలకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం అభినందనీయమన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో మెప్మా, డ్వాక్రా సంఘాలకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టడం ఎంతో స్ఫూర్తి కలిగించిందన్నారు. ఒక ఫౌండేషన్ ద్వారా హెల్త్, చదువు కు సంబంధించి సేవా కార్యక్రమాలు చేస్తారు...ఒక ఎంటర్ ప్రెన్యూర్ ను తయారు చేయటం కోసం ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం చాలా గొప్ప విషయమన్నారు. ఎస్.హెచ్.జి మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలి రోజు శిక్షణ లో భాగంగా పురుగుల నియంత్రణకు పరిచయం, బొద్దింకలపై పరిచయం ఈగల నియంత్రణ విధానాలు వంటి అంశాలపై అవగాహన శిక్షణా తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎ.ఐ.ఆర్.డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, ఎన్.ఐ.ఆర్.డి ఫెస్ట్ మేనేజ్మెంట్ ట్రైనీ కో-ఆర్డినేటర్ ఉదయ్ మీనన్, ఎన్వుఇండియా కంపెనీ ప్రతినిధి మొక్కపాటి అనిల్ కుమార్, కీటకాల మేనేజ్మెంట్ ట్రైనర్ జి.ఎస్.ఎస్.ప్రకాష్, ఎన్.ఐ.ఆర్.డి అధికారి మురళీకృష్ణ, ఎన్.ఐఆ.ర్.డి ఎన్.టి.ఆర్ జిల్లా అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా అర్బన్ మహిళ సమైక్య అధ్యక్షురాలు మీనాక్షి పాల్గొన్నారు.




# జగన్‌రెడ్డి పాలనలో రెవిన్యూ వ్యవస్థ సర్వనాశనం

## తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్



అమరావతి, (చైతన్యరథం): రాష్ట్రంలో పబ్లిసిటీ పిచ్చికి, ప్రచార యావకి రెవెన్యూ వ్యవస్థను వాడుకొని అస్థవ్యస్థం చేసిన జగన్ రెడ్డి నేడు భూ సంస్కరణలు తెచ్చా, రిజిస్ట్రేషన్లు పెంచానంటూ కల్లబొల్లి కథనాలు వల్లిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ మండిపడ్డాడు. అమరావతి లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం టీడీపీ ప్రభుత్వ హయాంలో తెచ్చిన సాంకేతికతతోనే రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతుంటే, అందుకు నేనే కారణం అంటూ సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నాడని. కంప్యూటరీకరణకు పునాదులు వేసిన వాడికి మళ్లీ సాక్షి పత్రికలో తప్పుడు కథనాలు రాస్తూ జగన్ రెడ్డి మరింత దిగజారిపోతున్నాడని ఆయన విమర్శించారు టెక్నాలజీపై జగన్ రెడ్డి 'కాపీ-పేస్ట్' ప్రచారం అసలు వాస్తవాలని 1999లోనే విజన్ 2020లో భాగంగా అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిఆర్ డి ఏ వ్యవస్థను తీసుకొచ్చి, రిజిస్ట్రేషన్ శాఖను దేశంలోనే మొట్టమొదటిగా కంప్యూటరీకరణ చేశారని. నేడు సులభంగా రిజిస్ట్రేషన్లు చేసుకోగలుగుతున్నామని ఆయన తెలిపారు. ఉన్న పాత సాఫ్ట్వేర్ ను జగన్ మార్చి, ఆ విండోపై తన బొమ్మ వేసుకుని "నేనే కనిపెట్టాను" అని బీరాలు పలకడం కేవలం జగన్ రెడ్డికే సాధ్యమైందని ఆయన విమర్శించారు. (%చీ+ణ=ూ% ) నేషనల్ జనరిక్ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సిస్టం పేరుతో ఒకే రకమైన రిజిస్ట్రేషన్ సాఫ్ట్వేరు అన్ని రాష్ట్రాలకు ఇస్తోందని. కేంద్రం ఇచ్చిన సాఫ్ట్వేర్ కు తన పేరు పెట్టుకోవడం జగన్ రెడ్డికి అలవాటైన విద్యార్థి ఆయన విమర్శించారు చంద్రబాబు హయాంలో రిజిస్ట్రేషన్లు ఒక పద్ధతి ప్రకారం జరిగితే. జగన్ హయాంలో "నిమిషాల్లో రిజిస్ట్రేషన్" అనే స్లోగన్తో రిజిస్ట్రార్లు అధికారాలను తగ్గించి, డేటా భద్రతను పణంగా పెట్టారని ఆయన విమర్శించారు రిజిస్ట్రేషన్లు వేగంగా చేస్తున్నాయని చెబుతూనే జగన్ ఐదేళ్లలో గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఛార్జీలను, స్టాంప్ డ్యూటీని అనేక సార్లు పెంచి ప్రజలను పీడించాడని రిజిస్ట్రేషన్ టెక్నాలజీ నాదే అని చెప్పుకోవడం చూస్తే. ఎవరికో పుట్టిన బిడ్డ నా బిడ్డే అన్నట్టుందని ఆయన విమర్శించారు. లికేంద్రం సొమ్ముతో జగన్ సోకులకు దేశవ్యాప్తంగా భూ రికార్డులను ఆధునికరించడానికి కేంద్రం డిఐఎల్ఆర్ఎంపీ తెచ్చిందని. దీనికి కేంద్రమే వందల కోట్లు ఖర్చు చేస్తుందని. కానీ ఈ డిజిటలైజేషన్ ప్రక్రియను జగన్ తన మేధస్సు తో కనిపెట్టినట్టుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పాతర్ల విమర్శించారు కేవలం కేంద్రం పేరును మార్చి తన పేరు ముదించుకొని నాదే అంత అనడం జగన్ కే సాధ్యమైందని ఆయన ఎద్దేవా చేశారు దేశంలో అనేక రాష్ట్రాల్లో ఈ పేపర్ లెస్ రిజిస్ట్రేషన్లు ఉన్నా ఏ సీఎం కూడా ఇలా డబ్బా కొట్టుకోలేదని ఆయన విమర్శించారు డిజిటల్ ఇండియా కేంద్రం కల అయితే దాన్ని డిజిటల్ జగన్ గా పేరు మార్చి మోసం చేయడం జగన్ కల అని ఆయన విమర్శించారు రీ- సర్వే పేరుతో జగన్ ఫోటో పిచ్చి..... రాష్ట్రంలో రైతులకు చెందిన పట్టా పాసు పుస్తకాలపై జగన్ రెడ్డి ఫోటోలు ముద్రించుకుని పిచ్చి తుగ్లక్ మాదిరి వ్యవహరించడం తన తాతల ఇచ్చిన ఆస్తులా ఫీలై రాష్ట్ర రైతాంగానికి షాక్ ఇచ్చాడని ఆయన విమర్శించారు పాస్ పుస్తకాలపై తన బొమ్మలు వేయడం జగన్ 100 కోట్లు ప్రజాధనాన్ని వృధా చేశాడని. రీ సర్వే పేరుతో పొలాల్లో పాత సర్వే రాళ్లు పై 700 కోట్లు ఖర్చు చేసి తన ఫోటోలు. పేర్లు చెక్కించుకున్నాడని ఆయన విమర్శించారు ప్రజల వ్యక్తిగత భూమి పత్రాలపై రాజకీయ నాయకుల ఫోటోలు ఉండకూడదని హైకోర్టు కూడా తీవ్రంగా ఆక్షేపించిందని ఆయన గుర్తు చేశారు కోటవి ప్రభుత్వం రాగానే ఆ ఫోటోలు పుస్తకాలు రద్దుచేసి మళ్ళీ గౌరవప్రదమైన రాజ్యముద్రలతో కూడిన పాసు పుస్తకాలను రైతులు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. సచివాలయంలో రిజిస్ట్రేషన్లు వ్యవస్థల విధ్వంసం తప్ప భద్రత ఎక్కడ?. సరైనా శిక్షణ లేని సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్లు. ఈ బాధ్యతలు అప్పగించడం అంటే ప్రజల ఆస్తులను పణంగా పెట్టడాని ప్రతి గ్రామంలోను తన మార్కుఉండాలనే తాపత్రయంతో వ్యవస్థలను జగన్ నాశనం చేశాడని ఆయన విమర్శించారు కేవలం తన రాజకీయ ఉనికి నీ చాటుకోవడానికి సత్య వాళ్ళయాలను రిజిస్ట్రేషన్ సెంటర్లుగా మార్చి ప్రజల ఆస్తులతో చెలగాటమాడాడని కేవలం పబ్లిసిటీ స్టంట్ కోసమే రిజిస్ట్రేషన్ పేరుతో నాటకం మాట్లాడడానికి ఆయన విమర్శించారు రిజిస్ట్రేషన్ శాఖకు రావలసిన ఆదాయానికి జగన్ గండి కొట్టాడని ఆయన విమర్శించారు గత ఐదేళ్ల పాలనల్లో స్టాంప్ డ్యూటీ. రిజిస్ట్రేషన్ ఫీజులు నాలుగు సార్లు పెంచి సామాన్యుడి సొంతింటి కల దూరం చేశాడని. ఆదనపు భారం వల్ల రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని లక్షలాది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన మండిపడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం ప్రజల ఆస్తులపై జగన్ రెడ్డి నల్ల చట్టం.... జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం ప్రకారం ప్రజల భూ హక్కును లాగేసుకున్నాడని వైసిపి నాయకులు చెబితే అధికారులు భూమిని ఎవరి పేరు కైనా మార్చేసే వ్యవస్థను జగన్ సృష్టించాడని ఆయన విమర్శించారు ల్యాండ్ టైటిల్ యాక్ట్ చట్టం ద్వారా వైసీపీ నేతల ల్యాండ్ కబ్జాకు పెన్నాగం పన్నారని. ప్రభుత్వం మారడంతో జగన్ పన్నాగం బెడిసి కొట్టిందని ఆయన తెలిపారు కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేసి ప్రజల హక్కులను కాపాడిందని రైతాంగం అంతా ముఖ్యమంత్రి చంద్రబాబుకు జేజేలు పలుకుతున్నారన్నారన్నారు.

# శాస్త్ర పరిశోధనలతో సృజనాత్మకత

## నలంద స్కూల్ సైన్స్ ఫేర్‌లో కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కావలి, (చైతన్యరథం): కావలి పట్టణం గాయత్రి నగర్‌లోని నలంద హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ ప్రాజెక్ట్ వర్క్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు తయారు చేసిన వివిధ శాస్త్రీయ నమూనాలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులను శ్రద్ధగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్ట్ వెనుక ఉన్న ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని తెలుసుకుంటూ విద్యార్థులను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇలాంటి సైన్స్ ఫేర్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. చిన్న వయస్సులోనే సూక్ష్మ ఆలోచనలు అలవర్చుకుంటే భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులుగా ఎదుగుతారని చెప్పారు. అలాగే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థుల జీవితంలో కీలకమని, వారిని సరైన దిశలో నడిపిస్తే సమాజానికి మంచి పౌరులు తయారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గారికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# క్రిస్టమస్ శుభాకాంక్షలు

## పాల్గొన్న ఆదిరెడ్డి, సోము, బొడ్డు, తదితరులు

రాజమహేంద్రవరం, (చైతన్యరథం): మంజీర కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ ను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ తదితరులతో కలసి అక్కడ నిర్వహించిన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని వారితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి క్రిస్మస్ ప్రేమ సందేశం ఇచ్చారు.

## టీడీపీ కొత్త అధ్యక్షుడు చేజర్లకు అభినందనలు

నెల్లూరు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శిశ్రీ నారా లోకేష్ ఆశీస్సులతో నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా 5వ సారి నియమితులైన టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర రెడ్డిని నెల్లూరు లోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి శుభాభినందనలు తెలిపిన





టిడిపిరాష్ట్ర పార్టీ కార్యదర్శి జన్ని రమణయ్య, రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి నావూరు శైలేంద్ర బాబు, జిల్లా మత్స్యసహాకార సంఘం అధ్యక్షులు పాల్ శెట్టి, తెలుగుదేశం పార్టీమీడియా కో ఆర్డినేటర్ జలదంకి సుధాకర్, అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్, బ్యూటిఫికెషన్ రాష్ట్ర డైరెక్టర్ కనపర్తి గంగాధర్,పార్టీ నాయకులు అస్లాం, శైలంద్ర బాబు, పమజుల ప్రదీప్, రవి,, మురళి, మస్తానయ్య, టిడిపి రజక సంఘం నాయకులు అంకయ్య, మత్స్యకార నేత పరదేశీ రఘురామయ్య తదితరులు.నెల్లూరు టీడీపీ కొత్త అధ్యక్షుడు చేజర్లకు అభినందనల వెల్లువ



# జోడిచింతలలో మినీ క్రిస్మస్ వేడుకలు

## పాల్గొన్న పూతలపట్టు శాసనసభ్యుడు డాక్టర్ కలికిరి

యాదమరి, (చైతన్యరథం): మండలం జోడిచింతలలో మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే అనంతరం క్రైస్తవ సోదరీమణులకు క్రిస్మస్ కానుకలు పంచిన పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఈ కార్యక్రమంలో యాదమరి మండల అధ్యక్షులు మొరార్జీ యాదవ్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ రబీ,జేనసేన మండల అధ్యక్షులు కుమార్,క్లస్టర్ ఇన్చార్జులు హిమగిరి, చిత్ర నాయుడు, మండల ఎంఆర్ఓ,క్రైస్తవ మత పెద్దలు, స్తానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.





# అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

## 5జీ ఫోన్లు అందజేసిన ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్

ఉదయగిరి, (చైతన్యరథం): అంగనవాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 5జీ సెల్ ఫోన్‌లను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 462 అంగనవాడి కేంద్రాల కార్యకర్తలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదగా సెల్ ఫోన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి విలువైన 5జీ సెల్ ఫోన్ లను అందజేస్తుందని తెలిపారు. వీటిని సక్రమంగా ఉపయోగించుకొని ప్రభుత్వానికి చిన్నారులకు తల్లిదండ్రులకు వారధిగా నిలవాలని తెలియజేశారు. మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పౌష్టికాహారం అందించడంతోపాటు, ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. ముఖ్యంగా అంగన్వాడి భవనాల సమస్యను అధిగమిస్తామని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని అధైర్య పడకుండా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. మీరందరూ ప్రభుత్వానికి అండగా నిలిచి చిన్నారులకు చక్కగా చదువు నేర్పించాలని ఎమ్మెల్యే దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు సీడీపీవో పద్మజాకుమారి, అడిషనల్ సిడిపిఓసర్మిష్ట ఉదయగిరి సీడీపీవో పుణ్యవతి, టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, బీజేపీ మండల కన్వీనర్, అంబటి ఈశ్వర్ రెడ్డి, జనసేన మండల కన్వీనర్ బండారు సత్యనారాయణ, సర్పంచ్ నల్లగొండ్ల సృజన సీనియర్ నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, గువ్వల కృష్ణారెడ్డి,మండల కో క్లస్టర్ కన్వీనర్ పాములపాటి మాల్యాద్రి, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి నాయుడు, ఎస్.కె మహబూబ్ బాషా, తిరుపతి ఆచారి, ప్రసాద్, ఆనంద్, ఉన్నారు.



# ఆపత్కాల పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి



రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన 60మంది లబ్ధిదారులకు, 61లక్షల రూపాయలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, సోమవారం రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంతి భవనంలో చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలకు చెందిన 08మంది లబ్ధిదారులకు, 14లక్షల 20వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయా మండలాలు, గ్రామాల ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్ చెరువు గ్రామానికి చెందిన రామాంజనేయులుకు 2లక్షల 20వేల రూపాయలు, కిష్టప్పకు 1లక్ష 6వేల రూపాయలు, వెంకటంపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్ రెడ్డికి 36వేల రూపాయలు, కనగానపల్లి మండలంచంద్రాచర్ల గ్రామానికి చెందిన కత్తే రామన్నకు 1లక్ష 11వేల రూపాయలు, ఎలక్కుంట్ల గ్రామానికి చెందిన వద్దే మమత గారికి 61వేల రూపాయలు, మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన కనగల పెద్దప్పయ్యకు 41 వేల రూపాయలు...రామగిరి ండలంపోలేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు 7లక్షల 60వేల రూపాయలు, రామగిరి గ్రామానికి చెందిన నరసింహులుకు 1లక్ష 53వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.



## పోలీస్‌స్టేషన్ మరమ్మతులను పరిశీలించిన కదిరి ఎమ్మెల్యే

కదిరి, (చైతన్యరథం): రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతులు పనులను కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ పరిశీలించారు. కావలసిన వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు

## డోన్ ఎమ్మెల్యే కోట్ల వెల్లడి



డోన్, (చైతన్యరథం): పట్టణంలోని 2వ వార్డులో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి తగిన పరిష్కారాలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన పిజిఆర్ఎస్ రచ్చబండ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యుడు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

త్రాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్యుత్, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన సమస్యలను శ్రద్ధగా విన్నారు.ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, ప్రతి వార్డులో అభివృద్ధి పనులు సమానంగా చేపడతామని తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం




కదిరి, (చైతన్యరథం): పట్టణంలో శ్రీ ఖాద్రి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిలుగా కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ గడుపూటిబినారాయణస్వామి హాజరయ్యారు. అదేవిధంగా, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల సంక్షేమం కోసం 7 వరాలు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చైర్మన్ నారాయణస్వామితో పాటు, మున్సిపల్ చైర్మన్, ఖాద్రి దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు , దివ్యాంగ సంఘాల నాయకులు, దివ్యాంగులు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంతిభవనంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరి, కనగానపల్లి చెన్నేకొత్తపల్లి మండలాల ఎంపీడీవోలు మరియు పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మరియు వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు.



# కడప టీడీపీలో సందడే సందడి







కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా నియమించిన తర్వాత పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామం నుంచి లిచదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, ర్యాలీగా సుద్ధపల్లె, పెద్దముడియం, పాలూరు, బోడితిప్పలపాడు, గుండ్లకుంట, ఉప్పలపాడు మీదుగా జమ్మలమడుగు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్

**- ఏకంగా 30 సీట్లతో అతిపెద్ద విజయం**

పనాజి: గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. 50 సీట్లలో 30 సీట్లు గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, స్వతంత్ర అభ్యర్థులు 5 సీట్లు గెలుచుకున్నారు. మహారాష్ట్ర గోమంతక్ పార్టీ (ఎంజీపీ) రెండు స్థానాల్లో గెలుపొందగా, గోవా ఫార్వార్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), రివల్యూషనరీ గోన్స్ పార్టీ (ఆర్‌జీపీ) ఒక్కో సీటు చెప్పున గెలుచుకున్నాయి. బీజేపీ ఈ ఎన్నికల్లో ఎంజీపీతో కలిసి పోటీ చేయగా జీఎఫ్‌పీ పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసింది. 2027లో గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఎన్నికలు జరగడం రాజకీయ ప్రాధాన్యతను సతరించుకుంది. గోవాలో 2012 నుంచి బీజేపీ అధికారంలో ఉంది.

**సుపరిపాలనకు ప్రజలు పట్టం: మోదీ**

గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఘన విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలన, ప్రగతిశీల రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'సుపరిపాలనకు గోవా ప్రజలు అండగా నిలిచారు. ప్రగతిశీలక రాజకీయాలకు పట్టం కట్టారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ-ఎంజీపీ (ఎన్డీయే) కూటమికి బలమైన మద్దతు ఇచ్చిన నా సోదరులకు, సోదరీమణులకు కృతజ్ఞతలు' అని అన్నారు. గోవా అభివృద్ధి దిశగా ఎన్డీయే చేస్తున్న ప్రయత్నాలకు ప్రజా తీర్పు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం పునరకింతమవుతుందని పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారణమైన కార్యకర్తలను ప్రధాని అభినందించారు.

**బీజేపీ విక్టరీపై సీఎం స్పందన**

జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీపై నమ్మకం ఉంచి ఘన విజయం అందించిన ఓటర్లకు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ-ఎంజీపీ (ఎన్డీయే) కూటమి నుంచి గెలుపొందిన అభ్యర్థులను అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై ప్రజలు నిర్ణయాత్మక తీర్పునిచ్చారని అన్నారు. 'గోవాలో బీజేపీ నెంబర్ 1. ఇంతటి ఘనవిజయంతో బీజేపీని ఆశీర్వదించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం పేర్కొన్నారు. గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఈనెల 20న జరుగగా, 70.81 శాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 50 నియోజకవర్గాల్లో 226 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.


## తల్లీకుమార్తెల అత్యాచార ఘటనలో ఐదుగురికి జీవితఖైదు

దాదాపు పదేళ్ల క్రితం దేశంలో సంచలనం సృష్టించిన తల్లీకుమార్తెల అత్యాచార ఘటనలో సోమవారం తుది తీర్పు వెలువడింది. 2016లో బులంధర్ జరిగిన ఈ అమానవీయ ఘటనలో ఇప్పటికే ఐదుగురిని దోషులుగా తేల్చిన న్యాయస్థానం.. వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. జూలై 28, 2016 రాత్రి సమయంలో ఢిల్లీ- కాన్పూర్ హైవేపై కారులో వెళ్తున్న ఓ కుటుంబాన్ని ఉత్తరప్రదేశ్‌లోని బులంధర్ ప్రాంతంలో గుర్తుతెలియని దుండగులు అడ్డుకున్నారు. వారి దగ్గర ఉన్న ఇనుపరాడ్లులతో కారును ధ్వంసం చేసి.. కారులో ఉన్న వారిని బెదిరించి, నగదు దోచుకున్నారు. అనంతరం మిగిలిన కుటుంబసభ్యులను బంధించి తల్లి, ఆమె 14 ఏళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు తొలుత ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయగా వారికి ఎలాంటి సంబంధం లేదని దర్యాప్తులో తేలింది. ఈ కేసు అప్పట్లో ఉత్తర్‌ప్రదేశ్లో తీవ్ర దుమారం రేపింది. దీంతో అలహాబాద్ హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. అనంతరం దర్యాప్తు చేపట్టగా.. బవేరియా ముఠాకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించారు. రెండేళ్ల తర్వాత 2018లో నిందితులను అరెస్టు చేసి సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసు పెండింగ్లో ఉండగానే.. నిందితుల్లో ఒకరు కస్టడీలో మరణించాడు. కొన్నేళ్ల పాటు సాగిన ఈ విచారణ అనంతరం ఇటీవల పోక్సో కోర్టు ఈ కేసులో ఐదుగురిని దోషులు తేల్చింది. తాజాగా వారికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో డీఎన్ఏ కీలక సాక్ష్యంగా ఉన్నట్లు బాధితుల తరపు న్యాయవాది వెల్లడించారు. అత్యాచారానికి గురైన బాధితురాలి దుస్తులపై నిందితుల డీఎన్ఏ ఉన్నట్లు ఫోరెన్సిక్ దర్యాప్తులో తేలిందని తెలిపారు.

# పిల్లాడికి దొరికిన బొమ్మ..పోలీసుల షాక్







చెత్తకుప్పలో దొరికిన కొత్తతరహా బొమ్మ తీసుకొని ఓ పిల్లాడు సరదాగా ఆడుకుంటున్నాడు. కానీ ఆ వస్తువును చూసి పోలీసులు షాక్ అయ్యారు. అది కూడా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కార్యాలయం పక్కన దొరికిందని తెలిసి అప్రమత్తమయ్యారు. ఆ దగ్గర్లోనే పోలీసు విభాగానికి చెందిన సెక్యూరిటీ ఆఫీస్ కూడా ఉంది. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం సృష్టిస్తోంది. అసలేం జరిగిందే జమ్ములోని సిధ్రా ప్రాంతంలో జాతీయ దర్యాప్తు సంస్థ కార్యాలయం పక్కన చెత్త కుప్పలో అసాల్ట్, స్నైపర్ రైఫిళ్లలో వాడే టెలిస్కోప్ ఒక పిల్లాడికి దొరికింది. అది ఒక బొమ్మగా భావించి అతడు ఆడుకుంటున్నాడు. అయితే ఆ విషయం పోలీసుల దృష్టికి చేరడంతో.. ఆ అనుమానాస్పద వస్తువును స్వాధీనం చేసుకున్నారు. అది చైనాలో తయారైందని గుర్తించడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అలాగే జమ్ము ప్రాంతంతో పాటు ప్రభుత్వ, సైనిక కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకావొద్దని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి 24 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై ఎన్ఐఏ ఛార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలోనే ఈ ఘటన వెలుగుచూసింది. ఈ సంస్థే ఇటీవల కాశ్మీర్లో చోటుచేసుకున్న కారు బాంబు పేలుడుపై దర్యాప్తు చేస్తోంది.

# ఇస్రో నుంచి మరో బాహుబలి రాకెట్

**- రేపు ఎల్‌వీఎం3 ఎం6 ప్రయోగం**

నెల్లూరు: సతీశ్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద ఎల్‌వీఎం3 ఎం6 బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54 గంటలకు బాహుబలి రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. బాహుబలి రాకెట్ ఎత్తు - 43.5 మీటర్లు, బరువు 6400 మీటర్లు ఉండగా.. ఈ రాకెట్ ప్రయోగ సమయం 15 నిమిషాల 7 సెకన్లు ఉండనుంది. అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్‌ని నింగిలోకి మోసుకెళ్లనుంది బాహుబలి రాకెట్. శాటిలైట్ బరువు 6100 కిలోలు ఉంది. ఈ శాటిలైట్‌ని అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించింది. గతంలో పంపిన శాటిలైట్ల కంటే పదిరెట్లు అధిక సామర్థ్యంతో బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్ పనిచేయనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ప్రస్తుతం ఎనిమిదో ప్రయోగం జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రయోగాలు విజయవంతమైన విషయం తెలిసిందే. చంద్రయాన్ -3 ప్రయోగానికి ఎల్‌వీఎం3 రాకెట్‌ని ఇస్రో వినియోగించనుంది. ఈ నేపథ్యంలో షార్‌కు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్, అమెరికా ప్రతినిధులు చేరుకున్నారు. ఎల్‌వీఎం3 ఎం6 ప్రయోగం పూర్తి వాణిజ్య ప్రయోగంగా తెలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకు అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో షార్‌లో సీఐఎస్ఎఫ్ జవాన్లు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.



# సోనియాగాంధీ, రాహుల్‌కు నోటీసులు





**- ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు ఈడీ**

**- నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం**

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈడీ ఛార్జిషీటుపై ట్రయిల్ కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను దర్యాప్తు సంస్థలో సోమవారంనాడు సవాలు చేసింది. దీంతో కేసులో నిందితులైన కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని, సాక్ష్యాలను సేకరించిందని, కేసులో భాగంగా పలుచోట్ల సోదాలు కూడా జరిపిందని చెప్పారు. ఈడీ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోకుండా దిగువ కోర్టు తప్పు చేసిందని ఆయన వాదించారు. ఈ కేసుపై తదుపరి విచారణను 2026 మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు గత మంగళవారంనాడు నిరాకరించింది. చార్జిషీటును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేటు వ్యక్తి సుబ్రమణ్యం స్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా చార్జిషీటును పరిగణనలోకి తీసుకోలేమని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టం ప్రకారం దీన్ని విచారించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రత్యేక న్యాయమూర్తి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈడీ చార్జిషీటు ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటే అవుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలిచ్చింది. ఈడీ ఛార్జిషీట్లలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లతో పాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్, సునీల్ భండారి పేర్లు చేర్చింది.

# జీరో స్థాయికి విమానం ఇంజిన్ ఆయిల్ ప్రెజర్

**- గగనతలంలో అత్యవసర పరిస్థితి**

**- టేకాఫ్..ఆ వెంటనే అత్యవసర ల్యాండింగ్**

గగనతలంలో ఎయిరిండియా విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైంది. సాంకేతికలోపం కారణంగా ఇంజిన్ ఆయిల్ ప్రెజర్ జీరోకి పడిపోయింది. ఢిల్లీ నుంచి ముంబయికి బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఈ లోపాన్ని గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 3.20 గంటల సమయంలో ఎయిరిండియా బోయింగ్ విమానం (ఫ్లైట్ఏ 1887) టేకాఫ్ అయింది. ఆ వెంటనే కుడివైపు ఇంజిన్ (ఇంజిన్ నెం2) ఆయిల్ ప్రెజర్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. తర్వాత అది జీరోకు పడిపోయింది. దాంతో అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. టేకాఫ్ అయినచోటే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించింది. భద్రతా ప్రోటోకాల్స్ ఆధారంగా విమాన సిబ్బంది నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఆ విమానంలో సాంకేతికపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు వెల్లడించారు. ఈ ఊహించని పరిస్థితి వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. ప్రయాణికులు ముంబయి చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పింది. కొన్నిరోజుల క్రితం కూడా ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన సంగతి తెలిసిందే. ఏపీలోని గన్నవరం నుంచి విశాఖ బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా నిలిచిపోయింది. అప్పుడు విమానంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు 163 మంది ప్రయాణికులు ఉన్నారు.

# బలవంతంగా రాజీనామా చేయించి పంపి..

◆అల్లరిమూకలకు అప్పగించి కిరాతకం
◆బంగ్లాలో హిందూ యువకుడి హత్య కేసులో..
వెలుగులోకి షాకింగ్ విషయాలు

బంగ్లాదేశ్‌లో మతోన్మాదానికి బలయిన హిందూ యువకుడు దీపూ చంద్ర దాస్ ఉదంతంలో తాజాగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్లాన్ ప్రకారం, అతడి హత్య జరిగినట్టు తెలుస్తోంది. మైమెన్‌సింగ్ జిల్లాలోని ఓ దుస్తుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న దీపూ చంద్ర దాస్ (27)పై కొందరు దైవ దూషణ ఆరోపణలు మోపి గురువారం దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. మతోన్మాద మూకలు దాడి చేసి అతడిని పొట్టనపెట్టుకున్నాయి. అనంతరం మృతదేహానికి నిప్పు పెట్టాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పక్కా ప్లానింగ్‌తో ఈ దారుణం జరిగినట్టు తెలుస్తోంది. దాడికి కొన్ని గంటల ముందు ఫ్యాక్టరీలోని సూపర్‌వైజర్లు దీపూతో బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించారు. ఆ తరువాత ఫ్యాక్టరీ నుంచి బయటకు పంపి అల్లరి మూకలకు అప్పగించారు. దుస్తుల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు కూడా ఈ దాడిలో పాలుపంచుకున్నట్టు బంగ్లాదేశ్ రాపిడ్ యాక్షన్ బెటాలియన్, పోలీసు అధికారులు చెబుతున్నారు. పోలీసులకు సకాలంలో సమాచారం అందించి ఉంటే



అతడు బతికి ఉండేవాడని కూడా చెబుతున్నారు. ఇక, దీపూ దైవ దూషణకు పాల్పడినట్టు ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ సుమారు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దుస్తుల ఫ్యాక్టరీ అధికారులు, వర్కర్లు కూడా ఉన్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

దీపూ హత్య అకస్మాత్తుగా జరిగినది కాదని కూడా అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు కొన్ని గంటల ముందే ప్లానింగ్ జరిగి ఉంటుందని చెబుతున్నారు. దీపూతో బలవం తంగా రాజీనామా చేయించడం, పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం జరగడం, బాధితుడిని అల్లరి మూకలకు అప్పగించడం వంటి వన్నీ ఘటనకు ముందు జరిగిన ప్లానింగ్‌ను సూచిస్తున్నాయని అన్నారు. మరోవైపు, ఈ ఉదంతంపై ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ కూడా పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ దారుణంలో పోలీసులు పాత్ర కూడా ఉండి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో న్యాయం జరుగుతుందా అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీపూకు మూడు ఏళ్ల క్రితం వివాహమైంది.



# ఇండోనేషియాలో ఘోర బస్సు ప్రమాదం..

**- 15 మంది దుర్మరణం**

**- సెంట్రల్ జావా ప్రాంతంలో విషాదం**

ఇండోనేషియాలోని సెంట్రల్ జావా ప్రాంతంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున సెమరాంగ్ నగరంలోని క్రాప్యాక్ టోల్ గేట్ వద్ద ప్రయాణికులతో వెళుతున్న బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడిక్కడే మృతిచెందగా మరో 20 మందికి తీవ్రగాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలు మొదలుపెట్టారు. ప్రమాదం జరిగే సమయానికి బస్సు అత్యంత వేగంగా వెళ్తోందని స్థానిక అధికారులు తెలిపారు. క్రాప్యాక్ టోల్ ఎగ్జిట్ కూడలి వద్దకు రాగానే బస్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ని ఢీ కొట్టడంతో బస్సు బోల్తా పడింది. చాలామంది బాధితులు బస్సు లోపలే ఇరుక్కుపోయారని, కిటికీ అద్దాలు పగిలి లోపలికి వెళ్లడానికి రెస్క్యూ టీమ్ ఇబ్బంది పడుతుందని అధికారి తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించామని తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బంగ్లాలో ఆగని హింస..మరొకరిపై కాల్పులు

ఢాకా: బంగ్లాదేశ్ హింసాకాండతో అట్టుడుకుతోంది. భారత్ అంటే విద్వేషం కలిగిన ఇంకిలాబ్ మోంచో విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ ఇటీవల కాల్పుల్లో మరణించిన అనంతరం తలెత్తిన ఆందోళనలు తగ్గుముఖం పడుతున్న తరుణంలో మరో యువనేతపై సోమవారం కాల్పులు జరగడం ఉద్రిక్తతలకు దారితీసింది. గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో అతని తల ఎడమ వైపు తుపాకీ తూటా దూసుకెళ్లింది. బంగ్లాదేశ్ నేషనల్ సిటిజన్ పార్టీ ఖుల్నా డివిజన్ చీఫ్ మొతలేబ్ సిక్దార్‌గా అతనిని గుర్తించారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించడంతో చికిత్స జరుగుతోంది.





బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం గత ఏడాది కూలిపోవడానికి దారితీసిన విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన హాదీపై ఇటీవల ఢాకాలో కాల్పులు జరిగాయి. 2026 ఫిబ్రవరి 12న జరుగనున్న పార్లమెంటరీ ఎన్నికల కోసం ప్రచారం జరుపుతుండగా జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన హాదీని సింగపూర్ తరలించారు. అయితే చికిత్స పొందుతూ గత వారంలో అతను కన్నుమూయడం బంగ్లాలో తీవ్ర ఆందోళనలకు దారితీసింది. హాదీ హంతకులు భారత్‌కు పారిపోయారని, తక్షణం వారిని అరెస్టు చేయాలని ఆందోళనకారులు హింసాకాండకు దిగారు. అయితే హాదీ హంతకుల గురించి సరైన ఆచూకీ లేదని బంగ్లా పోలీసులు చెబుతున్నారు. గత శనివారంనాడు జరిగిన హాదీ అంత్యక్రియల్లో బంగ్లా చీఫ్ అడ్వయిజర్ మహమ్మద్ యూనుస్ హాజరయ్యారు. హాదీ హంతకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, బంగ్లాదేశ్ ఉన్నంతవరకూ హాదీని ప్రజలు మరచిపోరని ఆయన వ్యాఖ్యానించారు.

# మైనార్టీల భద్రతలో యూనస్ సర్కార్ విఫలం

**భారత్-బంగ్లా సంబంధాలు దెబ్బతీయడానికే: షేక్ హసీనా**

బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా స్పందించారు. గతేడాది దేశంలో జరిగిన మారణహోమాన్ని ఆపడానికే తాను దేశం వీడి భారత్‌కు వచ్చానని.. భయపడి కాదని అన్నారు. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయిందని.. ప్రభుత్వం బలహీనంగా మారిపోయిందని విమర్శించారు. అక్కడ చట్టాలు ఏవీ అమల్లో లేవని.. దేశంలో పాలన సరిగ్గా లేకపోతే అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ పేరు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే మైనారిటీ యువకుడిని ఆందోళన కారులు దారుణంగా కొట్టి చంపి, నిప్పంటించడంపై హసీనా ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మైనారిటీల భద్రతను కాపాడడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమయ్యిందని ఈ ఘటనతో స్పష్టమయ్యిందన్నారు. యూనస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భారత్ వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటోందని.. కానీ పైకి మాత్రం భారత్ స్నేహం కోరుకుంటున్నట్లు బూటకపు మాటలు చెబుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి ఎన్ని తాత్కాలిక ప్రభుత్వాలు వచ్చినా భారత్-బంగ్లా మధ్య ఉన్న బంధాన్ని బలహీన పరచలేవన్నారు. యూనస్‌కు అండగా ఉన్న తీవ్రవాదులు దేశ ప్రజల మధ్య వైరాన్ని సృష్టిస్తున్నారని.. వారే తన కుటుంబాన్ని, తనను ప్రాణాల



కోసం పారిపోయేలా చేశారని హసీనా ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం దౌత్య కార్యకలాపాలను రక్షిస్తుందని.. వాటినిదెబ్బతీసే వారిపై చర్యలు తీసుకుంటుందన్నారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ ఫొటో మళ్లీ ప్రత్యక్షం

ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ఎప్‌స్టీన్ ఫైళ్లలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలు మళ్లీ ప్రత్యక్షమయ్యాయి. ఎప్‌స్టీన్ కుంభకోణానికి సంబంధించి సుమారు 16 ఫైళ్ల వరకూ అదృశ్యమయ్యాయని ఇటీవల పలు మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. వీటిలో న్యాయశాఖ వెబ్ పేజీ నుంచి డొనాల్డ్ ట్రంప్ సహా కొన్ని ఫొటోలు, డాక్యుమెంట్లు అదృశ్యమయ్యాయి. ముఖ్యంగా ట్రంప్ సతీమణి మెలానియా.. ఎప్‌స్టీన్, ఆయన సహాయకురాలు గిస్లేన్ మ్యాక్స్‌వెల్‌తో దిగిన చిత్రం, ట్రంప్.. కొందరు అమ్మాయిలతో దిగిన ఫొటోలు మాయమయ్యాయి. దీంతో డెమోక్రటిక్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ట్రంప్‌ను రక్షించే ప్రయత్నంలో భాగంగానే ఈ రకంగా చేశారని డెమోక్రాట్లు ఆరోపించారు. అటు హౌస్ మైనారిటీ లీడర్ హకీమ్ జెఫ్రీన్ కూడా ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఫొటోను పునః ప్రత్యక్షమయ్యేలా చేసింది న్యాయ విభాగం. అయితే.. ఆ పిక్ తొలగింపు వెనుక ఎవరి ప్రమేయమూ లేదని న్యాయశాఖ తెలిపింది. కేవలం రివ్యూ కోసమే తాత్కాలికంగా ట్రంప్ ఫొటోను తొలగించినట్టు పేర్కొంది. సమీక్ష అనంతరం ఆ ఫొటోల్లో ఎప్‌స్టీన్ బాధితులెవరూ లేరని తేలడంతో మరలా జోడించినట్టు వివరించింది. ఈ కేసులో బాధితులను రక్షించేందుకు మాత్రమే చట్టం ప్రకారం.. తాము ఫైళ్లలో సవరణలు చేస్తున్నట్టు, ఇందులో రాజకీయ నాయకులకు సంబంధించిన ఎవరి పేర్లనూ తొలిగించడం లేదని స్పష్టం చేసింది.

**ఏంటీ ఎప్‌స్టీన్ స్టోరీ?**

ప్రముఖ ఇన్వెస్టర్‌గా గుర్తింపు పొందిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు డొనాల్డ్ ట్రంప్, బిల్‌గేట్స్), బిల్‌క్లింటన్, మైకేల్ జాక్సన్ సహా పలువురు ప్రముఖులతో మంచి సంబంధాలుండేవి. వారిలో కొందరికి ఎప్‌స్టీన్.. అమ్మాయిలను సరఫరా చేస్తుండేవారని ఆరోపణలు వచ్చాయి. మీటూ ఉద్యమ సమయంలో ఆయన అరెస్ట్ అయ్యారు. దాంతో అప్పుడు సంచలన విషయాలు బయటపడే అవకాశముందని అందరూ భావించారు. కానీ, 2019 ఆయన జైల్లో అనుమానాస్పదంగా మృతిచెందడంతో యూఎస్ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ట్రంప్ హయాంలోనే ఈ ఫైళ్లు బయటకు వస్తాయని భావించినా అలా జరగలేదు. ఇటీవల ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు ఆ ఫైల్స్ విడుదలయ్యాయి. వీటిలో ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫొటోలు, ఇంటర్వ్యూ డాక్యుమెంట్లు, కోర్ట్ పత్రాలు మొదలగునవి ఉన్నాయి.

## మూడో టెస్ట్‌లో

# వెస్టిండీస్ ఘోర పరాజయం

### మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకున్న న్యూజిలాండ్



*న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్ట్‌లో వెస్టిండీస్ ఘోర పరాజయం పాలయింది. న్యూజిలాండ్‌లోని మౌంట్ మాంగనుయ్ వేదికగా జరిగిన ఈ టెస్ట్‌లో ఐదో రోజు సోమవారం 452 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 138 పరుగులకు కుప్పకూలింది. దీంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకుంది. మూడో టెస్ట్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా న్యూజిలాండ్ ఓపెనర్ డెవాన్ కాన్వే ఎన్నికయ్యాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీకి దక్కింది.*

*ఓవర్‌నైట్ స్కోరు 43/0తో ఐదో రోజు ఆట ప్రారంభించిన వెస్టిండీస్ 87 పరుగుల వద్ద బ్రెండన్ కింగ్ రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. ఆ తరువాత న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి వికెట్లు టపటపా రాలిపోయాయి. వెస్టిండీస్ బ్యాటర్లలో జాన్ కాంప్‌బెల్ (16), బ్రెండెన్ కింగ్ (67), ట్రెవిన్ ఇమ్లా (15), అండర్సన్ ఫిలిప్ (10) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ 5 వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకోగా, అజాజ్ పటేల్ 3, గ్లెన్ ఫిలిప్స్. రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.*

# విజయ్ హజారే ట్రోఫీలో ఆడనున్న గిల్, అభిషేక్






ఈ నెల డిసెంబరు 24 నుంచి మొదలుకానున్న విజయ్ హజారే ట్రోఫీలో టీమిండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలో దిగనున్నారు. ఈ టోర్నీ కోసం పంజాబ్ 18 మందితో జట్టును ప్రకటించింది. టీమ్ ఇండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, అర్షదీప్ సింగ్, అభిషేక్ శర్మలకు ఇందులో అవకాశం కల్పించారు. వికెట్ కీపర్, బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌తో పాటు ఆల్రౌండర్లు నమన్ ధీర్, అన్మోల్ ప్రీత్ సింగ్, రమణ్ దీప్ సింగ్, సన్వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, కెప్టెన్ ఎవరనేది మాత్రం వెల్లడించలేదు. పంజాబ్ తమ ఏడు లీగ్ దశ మ్యాచ్‌లను జైపూర్లో ఆడనుంది. ఛత్తీస్‌గడ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, గోవా, ముంబయితో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో జనవరి 8న ముగుస్తాయి. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌లో భారత జట్టుకు గిల్, అభిషేక్, అర్షదీప్ ఎంపికైతే.. విజయ్ హజారే ట్రోఫీకి వారు ఎన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారనే విషయంలో స్పష్టత వస్తుంది. విజయ్ హజారే ట్రోఫీకి పంజాబ్ జట్టు: శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్‌కీపర్), హర్నూర్ పన్ను, అన్మోల్ ప్రీత్ సింగ్, ఉదయ్ సహారాన్, నమన్ దీర్, సలీల్ ఆరోరా, సన్వీర్ సింగ్, రమణ్ దీప్ సింగ్, జషన్ ప్రీత్ సింగ్, గుర్నూర్ బ్రార్, హర్ ప్రీత్ బ్రార్, రఘు శర్మ, క్రిష్ భగత్, గౌరవ్ చౌదరి, సుఖదీప్ బజ్వా.

### గిల్‌ను తప్పిస్తారనుకోలేదు..

# భారత జట్టు ఎంపిక భేష్



మొన్నటివరకు టీ 20 ఫార్మాట్లో టీమ్ ఇండియాకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌ను 2026 -టీ20 ప్రపంచకప్‌నకు ఎంపిక చేసిన జట్టులో స్థానం కల్పించకపోవటంతో షాక్ అయ్యానని భారత మాజీ కెప్టెన్, చీఫ్ సెలక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ పేర్కొన్నాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ప్రస్తుత సెలక్షన్ కమిటీ ఇంతటి కఠిన నిర్ణయం తీసుకుంటుందని తాను ఊహించలేదన్నాడు. అదే సమయంలో ప్రపంచ కప్‌నకు ఎంపిక చేసిన జట్టు అద్భుతంగా ఉందని కితాబిచ్చాడు. నేను ఆశ్చర్యపోయా. ఇది అద్భుతమైన సెలక్షన్. శుభ్‌మన్ గిల్‌ను తొలగిస్తారని నేను ఊహించలేదు. తొలుత అతనిని వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఆస్ట్రేలియా పర్యటనలో కూడా గిల్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డేల్లో శుభ్‌మన్ గిల్ గొప్ప ఆటగాడు. టెస్టుల విషయానికొస్తే.. ఇంగ్లాండ్ లో భారీగా పరుగులు చేశాడు. కానీ, టీ20ల్లో ఇబ్బందిపడుతున్నాడు. ఇషాన్ కిషన్ లేదా మరెవరితోనైనా పోలిస్తే గిల్ స్ట్రయిక్ రేట్ చాలా తక్కువ. దేశవాళీలో అదరగొట్టిన ఇషాన్ కిషన్ ను భారత జట్టులోకి ఎంపిక చేయడం మంచి విషయం. రింకు సింగ్‌ను కూడా జట్టులోకి తీసుకున్నారు. మొత్తంమీద సెలక్షన్ కమిటీ అద్భుతమైన జట్టును ఎంపిక చేసింది. అభిషేక్ శర్మ, సంజుశాంసన్ ఓపెనింగ్ చేస్తారు. అభిషేక్ ప్రస్తుతం ప్రపంచంలోనే నంబర్ వన్ బ్యాటర్ అని క్రిస్ శ్రీకాంత్ అన్నాడు.

ఈ ఏడాది టెస్టు, వన్డే కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన గిల్.. ఆసియా కప్‌లో తిరిగి టీ20ల్లోకి పునరాగమనం చేశాడు. అంతేకాకుండా పొట్టి ఫార్మాట్లో అతడికి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో భవిష్యత్ సారథి అతడేనని అంతా భావించారు. కానీ, అంచనాలకు తగ్గట్లు గిల్ రాణించలేదు. 15 మ్యాచ్‌ల్లో 291 పరుగులే చేశాడు. అందువల్లే గిల్‌ను టీ20 ప్రపంచకప్ నకు ఎంపిక చేయలేదని క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం. ఫిబ్రవరి 27 నుంచి టీ 20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.




# అది నా ఫేవరెట్ షాట్

*శ్రీలంకతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ 20 సిరీస్‌లో భాగంగా విశాఖలో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా మహిళా జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ విజయంలో జెమీమా రోడ్రిగ్స్ కీలక పాత్ర పోషించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కి దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 121 పరుగులకే పరిమితమైంది. 122 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 14.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్(69 నాటౌట్) తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ అర్ధ శతకంతో అదరగొట్టింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన జెమీమాకే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం జెమీ మా మాట్లాడుతూ మంచి ఫామ్‌లో ఉన్నప్పుడు దానిని వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని చెప్పింది. అదే నా మైండ్ సెట్. ఆఫ్‌సైడ్ నా లేట్ కట్ షాట్‌ను అడ్డుకోవడానికి అక్కడ ఎంతమంది ఫీల్డర్లను పెట్టినా గ్యాప్ వెతికి షాట్లు కొడతా. ఆ లేట్ కట్ షాట్ నా ఫేవరెట్. పరిస్థితులను అర్థం చేసుకోవడంపై ఎక్కువ దృష్టిపెడతా. అందరూ అనుకున్నట్లుగా పిచ్ ఫ్లాట్‌గా లేదు. కొంచెం నెమ్మదిగా ఉంది. కానీ నేను మంచి టచ్‌లో ఉన్నాను. బాగా ఆడుతున్నప్పుడు బంతిని బాదడమే పనిగా పెట్టుకుంటా. అందుకే దూకుడును కొనసాగించా. స్కోరు గురించి కూడా ఆలోచించలేదు. మేం బాగా ఆడుతున్నాం. గతంలో ఏం జరిగిందో ఇప్పుడు అవసరం లేదు. త్వరలోనే టీ20 ప్రపంచ కప్ రాబోతోంది. మేం దానిని గెలవాలనుకుంటున్నాం. ఈ సిరీస్‌ను వరల్డ్ కప్‌నకు సన్నాహకంగా ఉపయోగించుకుంటామని జెమీమా వివరించింది. భారత్, శ్రీలంక మధ్య రెండో టీ20 మంగళవారం (డిసెంబర్ 23) విశాఖపట్నంలోనే జరగనుంది.*

# ఆస్ట్రేలియాలో గెలవటం అంత ఈజీ కాదు..

ఇంగ్లాండ్ టెస్ట్ జట్టుకు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ చురకలు వేశాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ పేలవ ప్రదర్శన చేస్తున్న సంగతి తెలిసిందే. జరిగిన మూడు టెస్ట్ మ్యాచుల్లోనూ ఇంగ్లండ్ ఓటమిపాలై 0-3 తేడాతో సిరీస్‌ను కోల్పోయింది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ జట్టు వరుసగా నాలుగో సారి సిరీస్‌న కోల్పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ జట్టుపై టీమిండియా వెటరన్ ప్లేయర్ రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు చేశాడు. గురుగ్రామ్‌లో జరిగిన మాస్టర్స్ యూనియన్ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన 'హిట్‌మ్యాన్' విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన క్రికెట్ కెరీర్‌లో మరపురాని విజయాలను గుర్తుచేసుకున్నాడు. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం అంత ఈజీ కాదు. కావాలంటే ఇంగ్లండ్ ప్లేయర్లను అడగండి చెబుతారు. 2021 ఆస్ట్రేలియాలో గబ్బాలో జరిగిన మ్యాచ్‌లో మేం గెలిచాం. రిషభ్ పంత్ అద్భుతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. మేం గెలుస్తామని ఎవరూ ఊహించలేదు. అలాంటి స్థితి నుంచి టీమిండియా పుంజుకుని గెలిచింది. ఆ మ్యాచులో మా ఫస్ట్ ఛాయిస్ ఆటగాళ్లందరూ గాయాలు, వివిధ కారణాల వల్ల ఆటకు దూరమయ్యారు. ఆ సమయంలో ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ మా గురించి కొంచెం చులకనగా మాట్లాడాడు. అది నాకు ఇంకా గుర్తుంది.

ఆ మాటలు మాలో కసిని నింపాయి. గబ్బా ఆస్ట్రేలియాకు కంచుకోట. అప్పటివరకు వారికి అక్కడ ఓటమి అనేదే తెలీదు. కానీ, గెలుపుపై ఆశలు లేని స్థితి నుంచి మేం గొప్పగా పుంజుకుని ఆ మ్యాచ్ గెలిపించాం. అయితే, టెస్ట్ క్రికెట్ ఎలా ఉంటుందో మీకు తెలుసు. ఇందులో ఆడటం అంత సులభం కాదు. ఆస్ట్రేలియాలో ఆడటం కఠినమైన సవాలు. కావాలంటే మీరు ఇంగ్లాండ్ ఆటగాళ్లను అడగండి.



గబ్బాలో విజయం సాధించి ఆ తర్వాత ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం తాము సాధించిన గొప్ప ఘనత అని రోహిత్ పేర్కొన్నాడు.

# జోరు తగ్గని ధురంధర్



రణ్‌వీర్ సింగ్ తాజా సంచలనం ధురంధర్ సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మూడు వారాలు ముగిసినా వసూళ్ల విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. గత ఒక్క వారంలోనే సుమారు రూ.100 కోట్లు వసూలు చేసింది. ఆ నెల 5ం తేదీన విడుదలైన ఈ సినిమా మొత్తంగా చూసుకుంటే ఇప్పటి వరకూ రూ.800 కోట్లకు (గ్రాస్) పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఒక పక్క జేమ్స్ కామెరూన్ అవతార్ హవా నడుస్తున్నా, ధురంధర్ జోరు మాత్రం తగ్గడం లేదు. ఈ హవా ఇలాగే మరో రెండు వారాలు కొనసాగితే, రూ.1000 కోట్ల మార్క్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా హిట్లు లేక ఆపసోపాలు పడుతున్న హిందీ చిత్ర పరిశ్రమకు ఈ ఏడాది ఆరంభంలో 'చావా' విజయోత్సాహాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆఖరి నెలలో వచ్చిన ధురంధర్ ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా రికార్డు సృష్టించింది. 2025లో రూ.500 కోట్లు మార్కును దాటిన సినిమాలు ఐదు మాత్రమే ఉండగా అందులో ధురంధర్ నెం.1లో నిలిచింది. దాని తర్వాతి స్థానాల్లో కాంతార: చాప్టర్1 (రూ.850 కోట్లు), చావా (రూ.797 కోట్లు), సయారా (రూ.579 కోట్లు) కూలీ, (రూ.514) ఉన్నాయి.

### 1000 కోట్ల క్లబ్‌లోకి..

ప్రస్తుతం రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన చిత్రాలు మొత్తం 8 ఉన్నాయి. వీటిలో తెలుగు నుంచి నాలుగు (బాహుబలి-2, పుష్ప-2, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ), హిందీ నుంచి మూడు (దంగల్, జవాన్, పఠాన్), కన్నడ నుంచి ఒక్కటి (కేజీయఫ్: చాప్టర్2) ఉన్నాయి.. ధురంధర్ హవా ఇలాగే కొనసాగితే, ఈ జాబితాలో చేరిన 9వ చిత్రమవుతుంది. అంతేకాదు, టాలీవుడ్ రికార్డును బాలీవుడ్ సమం చేస్తుంది.

ఇలా ఉంటే ధురందర్ 2ను మార్చి 19, 2026న విడుదల చేస్తామని చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.ఎలాంటి అవాంతరాలు లేకపోతే, ఈ డేట్‌కు సినిమా రావడం ఖాయం. తొలి భాగం చూసిన వారందరూ పార్ట్ 2 ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా ఎలా ఉన్నా. మొదటి భాగంతెచ్చిన ఊపుతో ఆరంభం లోనే అదిరే వసూళ్లు రాబట్టడం ఖాయమని ట్రేడ్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సాధారణంగా ఒక భాషలో విడుదలై విజయవంతమైన చిత్రాన్ని వీలైనంత త్వరగా ఇతర భాషల్లోకి డబ్ చేసి, విడుదల చేయడం ఇటీవల సర్వ సాధారణమైపోయింది. మరి, ధురంధర్ కూడా మొదటి వీకెండ్ తర్వాత తెలుగులోనూ వస్తుందని టాక్ వినిపించింది. అయితే, మేకర్స్ నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. హిందీలోనే ఈ మూవీకి మంచి ఆదరణ వస్తున్న నేపథ్యంలో డబ్బింగ్ జోలికి వెళ్లకూడదని భావిస్తున్నారట. అయితే, ధురంధర్ 2ని మాత్రం హిందీతో పాటు ఇతర భాషల్లో విడుదల చేయాలని అందుకు తగినట్లుగా మార్పులు చేసుకుంటోంది చిత్ర బృందం.

## తప్పనిసరి పరిస్థితుల్లోనే 25న 'వృషభ' విడుదల




క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు తెలుగు సినిమాలు వరుస కట్టగా అదే తేదీన మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ వృషభ సినిమా కూడా విడుదల కానుంది. నిర్మాత బన్నీ వాస్ దీనిని తెలుగులో విడుదల చేస్తున్నారు. వృషభ ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో బన్నీ వాసు మాట్లాడారు. పలు తెలుగు చిత్రాలు విడుదల సమయంలో డబ్బింగ్ సినిమాని ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నకు బన్నీ వాసు స్పందించారు. ఈ సినిమా రెండు నెలల క్రితం విడుదల కావాల్సి ఉంది. సీజీ వర్క్ పూర్తికాకపోవడంతో ఈ నెల 25కి వాయిదా పడింది. నిర్మాణ సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు అదే తేదీన విడుదల చేయక తప్పటం లేదు. ఈ మూవీ ప్రొడక్షన్ హౌస్ కనెక్ట్ మీడియా, దీనిని హిందీలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న పెన్ మూవీస్‌తో మాకు అనుబంధం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే.. అన్ని తెలుగు సినిమాలున్నా విడుదల చేస్తున్నామని తెలిపారు. తెలుగులో ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేయనుంది. ఈ సమావేశంలో వృషభలో నటించిన అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఆది సాయికుమార్ 'శంబాల', రోషన్ 'ఛాంపియన్', శివాజీ, నవదీప్‌ల 'దండోరా'తోపాటు 'ఈషా', 'పతంగ్', 'బ్యాడ్ గర్ల్స్' చిత్రాలు ఈ నెల 25న విడుదల కానున్నాయి. మరోవైపు, కన్నడ నటుడు సుదీప్ హీరోగా తెరకెక్కిన 'మార్క్' కూడా అదే రోజు రానుంది.

## ఆది నా పరువు నిలబెడతాడు



'శంబాల' సినిమాతో కుమారుడు ఆది తన పరువు నిలబెడతాడని విలక్షణ నటుడు సాయికుమార్ అన్నారు. ఆది హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని తెరకెక్కించారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్ మాట్లాడుతూ.. మా నాన్న, అమ్మ, ఇద్దరూ ఇండస్ట్రీకి చెందినవారే. మా అందరినీ అమ్మ కళాకారులుగా తీర్చిదిద్దారు. నాన్న స్వరం, అమ్మ ఇచ్చిన సంస్కారం, కళామతల్లి ఆశీర్వాదం, మీ అందరి అభిమానంతో ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. మా అబ్బాయి ఆది 2011లో 'ప్రేమ కావాలి' సినిమాతో ప్రయాణం మొదలు పెట్టాడు. మొదటి అడుగుతోనే విజయాన్ని అందుకున్నాడు. రెండో సినిమా 'లవ్లీ' కూడా హిట్ అయింది. ఆ తర్వాత కూడా ప్రేక్షకులను అలరించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ, కొన్ని తప్పటడుగులు పడ్డాయి. జయాపజయాలు మన చేతుల్లో ఉండవు. అయినా వెనకడుగు వేయకుండా ప్రయాణం సాగిస్తున్నాడు. ఈ సినిమాతో నా పేరు నిలబెడతాడన్న నమ్మకం తనకు ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. నాకు ఇండస్ట్రీలో తెలిసిన మొదటి పెద్ద హీరో సాయికుమార్ మాత్రమే. ఆయన వల్లే నా కెరీర్ ఇలా ఉంది. ఎస్ఆర్ కళ్యాణమండపం సినిమాలో ఆయన పాత్ర అంత గొప్పగా లేకపోయి ఉంటే నేను ఈరోజు ఇలా ఉండేవాడిని కాదు. అందరూ బాగుండాలని కోరుకుంటారు. క్రమశిక్షణతో ఉండాలని చెబుతారు. ఆయన పరిచయంతో తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు.

## చిరు, వెంకీ కలిసి స్టెప్పేస్తే...

మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంటేష్ కలిసి స్టెప్పులేస్తే అభిమానులకు పండుగే. ఈ సంక్రాంతికి అందుకు రెడీ అయిపోమంటున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. చిరంజీవి, నయనతార జంటగా అనిల్ దర్శకత్వం వహిస్తున్న 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రం ఈ సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది. ఇందులో విక్టరీ వెంకటేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. చిరంజీవి, వెంకటేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంటాయని ఇప్పటికే టీమ్ చెప్పింది.అయితే ఇప్పుడు మరో సర్‌ప్రైజ్ ఇచ్చారు దర్శకుడు. చిరు, వెంకీ ఇద్దరూ ఈసినిమాలో ఓపాటకు డ్యాన్స్ చేశారట. ఉర్రూతలూగించే ఆ పాటను త్వరలోనే రిలీజ్ చేస్తామని డైరెక్టర్ అనిల్ ప్రకటించారు.

'శంబాల' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న అనిల్ తాజాగా ఈ అప్‌డేట్ ఇచ్చారు. చిరు, వెంకీ కలిసి ఒకే సినిమాలో ఉన్నారంటేనే క్రేజ్. ఇప్పుడది పదింతలు అయింది. ఇద్దరినీ కలిపి తెరపై చూడబోతుండటం అభిమానులకు పెద్ద పండుగలా ఉంది.ఇప్పటికే ఈసినిమా నుంచి విడుదలైన 'మీసాల పిల్ల', 'శశిరేఖ'పాటలు ఎంతగా బాగా ఆకట్టుకున్నాయి. 'మీసాల పిల్ల' 90 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది.'శశిరేఖ' సైతం యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ రెండు పాటల్లోనూ చిరు, నయన్ ఆడిపాడి సందడి చేశారు. రాబోయేసాంగ్‌లో చిరు,వెంకీ ఇద్దరూ స్టెప్స్‌వేయనున్నారని అనిల్ చెప్పారు.

## రెండు ప్యానల్ల మధ్యనే పోటి

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు డిసెంబర్ 28న హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్ కార్యాలయంలో జరుగబోతున్నాయి. ఛాంబర్ లోని స్టూడియో, ప్రొడ్యూసర్స్, ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్.. ఈ నాలుగు సెక్టార్ల కౌన్సిల్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎన్నుకోబోతున్నారు. అయితే ఈసారి పోటీ ప్రధానంగా అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు బలపరుస్తున్న ప్రోగ్రెసివ్ ప్యానల్‌కు చదలవాడ శ్రీనివాసరావు, సి. కళ్యాణ్, ప్రసన్న కుమార్ బలపరుస్తున్న మన ప్యానెల్‌కు మధ్యనే ఉండబోతోంది.

ఇందులో ప్రొడ్యూసర్స్ సెక్టార్ కౌన్సిల్‌లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుండి భరత్ చౌదరి, చిరంజీవి (చెర్రీ), కృష్ణ ప్రసాద్ శివలెంక, లీలా దామోదర ప్రసాద్ (దాము), రాజేశ్ దండు, రామకృష్ణ గారగపర్తి (రాంకీ), రామకృష్ణ కసుల, రామకృష్ణ వి (ఆర్.కె.), రమేశ్ మన్యం, స్రవంతి రవికిశోర్, సాంబశివరావు జె, సతీశ్ కుమార్ వర్మ వేగేశ్న, మధుర శ్రీధర్ రెడ్డి, డి శ్రీనివాసరావ్రీ, సుబ్బారావు జంజనం, వివేక్ కూచిభొట్ల, సుదర్శన్ రెడ్డి ఆర్., సుధాకర్ బాబు సిహెచ్., వెంకటేశ్ మంచి, వేణుగోపాల్ బెక్కెం బరిలో ఉన్నారు. మన ప్యానెల్ నుండి అమ్మిరాజు, బాబ్జీ, వైవియస్ చౌదరి, గురురాజ్, సి. కళ్యాణ్, పల్లి కేశవరావు, కోటి బాబు, పి.ఎల్.కె. రెడ్డి, లక్ష్మీ కరణ నట్టి, మోహన్ వడ్లపట్ల, పద్మిని ఎన్, ప్రసన్న కుమార్ తుమ్మల, రామకృష్ణ గౌడ్, రామసత్యనారాయణ, రామేశ్ బాబు వల్లూరిపల్లి, రవిచంద్ యలమంచి, చదలవాడ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు వజ్జా, సురేందర్ రెడ్డి, ఎం.వి. కిశోర్ పూసల పోటీ చేస్తున్నారు.

అలానే ప్రొడ్యూసర్స్ సెక్టార్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుండి అభిషేక్ అగర్వాల్,అశోక్‌కుమార్, బాపినీడు, కృష్ణప్రసాద్ శివలెంక, లీలా దామోదర ప్రసాద్, నాగవంశీ సూర్యదేవర, కె.ఎస్. రామారావు, స్రవంతి రవికిశోర్, రవిశంకర్ యలమంచిలి, సాంబశివరావు ఐ, చలసాని ప్రియాంక దత్, దిల్ రాజు బరిలో ఉన్నారు. ఇక మన ప్యానర్ లో నుండి ఈ కేటగిరికి అమ్మిరాజు, వైవియస్ చౌదరి, సి.కళ్యాణ్, పల్లి కేశవరావు, నట్టి లక్ష్మీ కరుణ, వడ్లపట్ల మోహన్, ఎన్. పద్మిని, ప్రసన్న కుమార్ తుమ్మల, ప్రతాని రామకృష్ణ గౌడ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, చదలవాడ శ్రీనివాసరావు, సాయి వెంకట్ పోటీ చేస్తున్నారు.

